ర

Reg. No. 757

అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది గ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 19 | 1927 సం॥ జూన్, జూలై నెలలు. | సంచిక 3,4

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0 సహాయులకు రు 5 0 0

పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

ప్రధానపోషకులు.

1 శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, గుల్బరగా జిల్లా
2 శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, మడికొండ
3 బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాదవరం.
4 రామసింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.
5 శ్రీమద్వేంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖు గార్లు, అల్లాదుర్గసంస్థానము.

పోషకులు.

1 శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, విశాఖపట్టణంజిల్లా.
2 ఎనమండ్ర [illegible] నరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
3 రాజా వెంకటాద్రియప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
4 రాజామంత్రిప్రగఢ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
5 తరిగొడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
6 శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
7 లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
8 చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
9 టి. లక్ష్మణసింగుగారు, జోనగాం
10 నెల్లుట్ల నరసింహారావుగారు, జోనగాం
11 రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లి.
12 పేరులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
13 జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు
14 పిసుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
15 శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, ఇంగోలి.
16 గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానుకొండూరు
17 కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
18 లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి దేశముఖుగార్లు-నారాయణపురం

సహాయులు

1 వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
2 బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ
3 సంగెం రామారావుగారు, కుంటపల్లి.
4 పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
5 నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
6 రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట
7 నారాయణరావుగారు, దాతారుపల్లి

అభినవసరస్వతి

సంపుటము ౯ { జానపాద్యు / పరిభవ సం॥ జ్యేష్ఠమాసము } సంచిక 3

దేశభాషాప్రాధాన్యము.

క్రీస్తువెనుక 12వ శతాబ్దమున వ్రాయుచు అల్ బిరూని అను మహమ్మదీయ విద్వాంసుఁడు హిందువుల యభిమానమును గురించియు, గర్వమును గురించియు విశేషముగ వ్రాసెను.

"అయ్యో వారిగర్వ మింతంత యని నుడువఁజాలను, భూలోకమునఁ దమదేశముతో సరి యయిన దేశము వేఱొండు లేదనియుఁ, దమదేశమే పుణ్యభూమి యనియు, దమకు వచ్చినవిద్యలన్యజాతుల వారికి నన్యదేశీయులకు రావనియుఁ, దమదేశీయులే శాస్త్రజ్ఞానము గలవారనియుఁ, గలానైపుణము వారియొక్కసొత్తే యనియు, వేదాంతాది దర్శనములు వారికే యున్నవనియు, వారేదేవునికిఁ బ్రియులనియు నన్యులు పశుప్రాయు లనియు, నాచారశూన్యు లనియు, వ్రతహీను లనియుఁ, బతితులనియు, నస్పృశ్యులనియు, మ్లేచ్ఛులనియుఁ, బరమ తిరస్కారపాత్రు లనియు, సంభాషణకుసైతము నసర్హులు, అనియుఁ వారియభిప్రాయము. వీరిగర్వము మహాపర్వతసన్నిభమై యన్యులకుఁ దల కంటగింపఁజేయుచున్నది. వీరు తమదేశము విడిచి యన్యదేశమునకుం బోవువారు కారు. అట్లితరదేశములు చూచి యాదేశములవారనుభవించిన సత్కార్యములను సాధించిన శాస్త్రముల నవలంబించు నాచారములను జూచినయెడల వీరికిఁ గొంత గర్వము తగ్గునేమో" అని వ్రాసియుండెను. దాదాఁపాకాలముననే యాంధ్రదేశకవికులగురు వగు వాగనుశాసనుండు "స్వస్థానవేషభాషాభిమతాస్సంతోరస ప్రలుబ్ధధియః లోకే బహుమన్యంతే వైకృతకావ్యాని చాస్య దపహాయ" అని సంస్కృతభాషయం దెట్టిగౌరవము విద్వాంసులకుండెనో యట్టియాదరము నాంధ్రాది వైకృతకావ్యములందు స్థాపించి రసోత్పాదనావ్యాపారమున నాంధ్రభాష దేవభాషకుం దీసిపోవునది కాదని స్వకృతులచే నిరూపిం

చిరి. దేశభాషలు తలయెత్తి సర్వతోముఖముగా నభివృద్ధిఁజెంది కావ్య శాస్త్రకలాబోధకములగు మహోన్నతభాషలై వెలయుటకుసమకట్టఁగా నాంధ్రము ప్రథమమునఁ గావ్యరూపమున నామహామహుని సృష్టితో డనే బయలుదేఱ తిక్కనసోమయాజి ప్రోపుఁజెంది మహనీయస్థితిం బొంది భాస్కర సోమనాథ శ్రీనాథ పోతనాదులచేఁ బరమోత్కృష్ట దశం బొంది యాంధ్రభోజుం డని విఖ్యాతిం గాంచిన శ్రీకృష్ణదేవరాయ చక్రవర్తిశిరోమణి కాలమున దేశభాషలందుఁ దెలుఁగులెస్సయని బిరుదుఁగాంచి యత్యంతప్రీతిపాత్రమై విలసిల్లెను. ఆకాలమున రసోత్తరములై వాసిఁగాంచిన వసుచరిత్రాదులు కొన్ని గీర్వాణమునకుఁ భాషాంతరీకృతము లయ్యెనని తెలియుచున్నది. ఈగౌరవము వైకృత గ్రంథములలో రెండుమూఁడింటికి మాత్రమే గలిగినట్లు తెలియుచున్నది. అంతటిమహాపురుషుల నిస్తులాభిమానముచేఁ బెంపొందుఁచుండిన భాషామతల్లికి నేఁ డెట్టిదురవస్థ వాటిల్లెనో యించుకయోజింపుఁడు. ఆగర్వమును నాయభిమానమును మాయమై పోయినవి. వాని స్థానమున ననాదరణయు నవమానమును నెలకొనినవి. తెనుఁగుబాస ఈతనికి వచ్చునన్న మాత్రముననే ఇంగ్లిషురా దనుధ్వని యెచ్చటఁ బుట్టునో యని దిగులును, గొంతకాలమైనను దెనుఁగుఁ జదువుటలో వినియోగించుటకంటె నాకాలమునుగూడ నింగిలీసుననే యుపయోగించిన మఱింత పాండిత్యము గాదా యనునాసయు మనము నావరించినవి. " నాకుఁదెనుఁగు రా " దనియుఁ " దెలుఁగులో వ్రాయఁ బోయితిని సాధ్యముగా లేద " నియుఁ జెప్పుకొనుట మర్యాదకుం గారణము లైనవి.

పండితుఁ డటన్నను ద్విపాదపశువటంచు, మృగపతికిఁ జెప్పి
నాఁడ నికేమికొదవ.

అని కాళ్ళకూరి గోపాలరాయఁడు పండితులయెడఁ గలయాదరమును విస్తరించెను. ఇంకను వేయు మాటలేల ?

ఇంతటివిపత్తునకుం గారణములు మనప్రభుత్వము వారవలంబించు విద్యావిధానమును నస్మద్దేశీయుల లోభమును గారణములై యున్నవి.

" కలావతాం మహేచ్ఛానాంనాశ్రియః పార్థివం వినా. "
అను రీతిని

రాజాశ్రయము లేనిది జరుగుఁబాటు లేక తమ విధివిహితవిద్యలను దేశభాషలను బ్రాహ్మణాదులు వదలిపెట్టరని కొందఱందురు గాఁబోలును. ఈవచనమునను గించిన్మాత్రము సత్యముండవచ్చును. గీర్వాణమునందేమి దేశభాషలయందేమి అప్పటికాని కాలమున నుండిన శాస్త్రాదిగ్రంథములు నేటికి నున్నవి. ఇంకను బెరిఁగినవి. దేశభాషలయందు నిశ్చయముగాఁ బెరిగినవి. తులసీదాసును, కబీర్దాసును, తిక్కన పెద్దన, బట్టుమూర్తులును, శ్రీనాథ, పోతనామాత్యులును దమవాఙ్మాధురిచే దేశభాషలకు వన్నెపెట్టిరి. అయినను నాయభిమానము, నా స్వాతంత్ర్యము, నాయాదరమును మాటిపోయి తద్విపరీత భావములు దేశీయుల హృదయకుహరములు నిండించియున్నయవి.

దాదాపు 70 ఏడ్లకుమున్నె యుండియీదేశమును దమ నీతిబలముచే జయించి స్వాధీనముచేసికొని యుండిన బ్రిటీషువారు తమ రాజ్యము దృఢముగ నిల్పుకొనుమార్గము లెవ్వి యని యోజించిరి. వారి పండితులును విద్వాంసులును స్వమతవిద్యాదులయందు వారికి విశ్వాసమున్నను లేకపోయినను, నీదేశమువారిని దేశీయమతవిద్యల నుండి త్రిప్పి తమ మతవిద్యలను నేర్పినఁగాని, నిరంతరము లోఁబడి వారిని గౌరవింపరని చక్కఁగ నెఱింగియుండిరి. వారికి దాసులుగ నీదేశమువారినిఁ జేయవలయునన్న వారిదేహములనుమాత్రముజయించినఁ జాలదు. వారి బుద్ధిబలమును నిర్మూలింపవలయును. వారి స్వదేశ వేషభాషాదులయందు విస్మృతి విద్వేషములు గలిగింపవలయును. అర్థకాంతుచే నీ రట్లుచేయుచుండినది వాస్తవమే యైనను వారిధర్మపరికరణమున నంతకంటె నుత్తమ ధర్మము గానంబడినదిగాదు. స్వధర్మనిరతి శాస్త్రము వారిధర్మకోశములలోఁ జేరియుండలేదు.

శ్రేయాన్ స్వధర్మోవిగుణః పర ధర్మాత్ స్వనుష్ఠితాత్
సధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.

అను నీయాశయము వారిమతగురువులయెడ మృగ్యము చీనాదేశీ

యుండగు లేయోట్జి అనుస్మర్త యీన్యాయమును 600 బి. సి. కాలమున బోధించియుండెను. బౌద్ధచక్రవర్తి యగు నశోకుండు తన శిలాస్తంభములయందు స్వధర్మనిరతియుఁ బరధర్మాదరమును బోధించెను. కాని యేసుక్రీస్తుమాత్రము "నాయనలారా! ఇంటికప్పులపై కెక్కి నాధర్మమును బోధింపుఁడు. ఈధర్మము నెఱుఁగకపోయిన జనులు చత్తురు. వారికి మోక్షము గలుగవలె నన్న నావచనములే మార్గము. లోకమును మీరే కడతేర్పవలయును." అని బోధించెను. బ్రహ్మజిజ్ఞాసువై తనయంతికమునకు శుశ్రూషచేయుటకై వచ్చిన తనకుమారునికి వరుణుఁడు "తపస్సుచే నీవే బ్రహ్మను గనుఁగొను" మని కదా చెప్పెను. ఆబాలుఁడు ప్రయాసపడి స్వయముగనె బ్రహ్మసాక్షాత్కారము నొందె నని తైత్తిరీయము చెప్పుచున్నది. జిజ్ఞాసాభేదము దక్క నాబాలునికిని నన్యులకును నేమి తారతమ్యము గలదు? ఆదిగురు వగునేసుక్రీస్తునకున్న సత్త్వమొరులకుండునా. అందుచే వారిశిష్యులు పరమోక్షాపేక్షచే వారిం గట్టివేసి మతబోధ యారంభింతురు. మాకు వలదయ్యా యనుచుండినను బలవంతపు మాఘస్నానముఁ జేయింతురు. కట్టివేసి యనఁగా సామాన్యముగా ధనాద్యాశాపాశములచే నని యూహింప వలయును. కాలేజులయందు విద్యార్థులు కొందఱు ఉద్యోగాసక్తిచే మిషనరీల నాశ్రయించుటయు నిర్బంధముగ వారు బైబిలు బోధకాలమునఁ గిదరగదిలో నుండుటయుఁ, బరిహాసపూర్వకము లగు ప్రశ్నములు మతవిషయములలో వేసి గురువులను వారిగురువుల నుల్లఘించుటయు వీరు మిక్కిలి లాఘవంపడుటయు నెఱుఁగనివా రుండరు. ఇంతకంటె నిర్బంధముగను పోల్చుగీసువా రనేకగ్రామములను దమమతములోఁ జేర్చుకొన్నట్లు చరిత్రమువలనఁ దెలియుచున్నది. అన్యుల కపవర్గ మిచ్చునపుడు వారియిష్టముమీఁదనే యియ్యవలయు నవసరమేమి? బలాత్కారముగ నైనను నీయవచ్చును! బలాత్కారముగా వేరుమతమువారిని దమమతమునకుం ద్రిప్పుకొనుట వీరిదేహబలమునకు గౌరవమా మతబలమునకు గౌరవమా యనువిషయ మటుండ నీఁగను దేనెలో బలాత్కారముగ ముంచినఁ జచ్చునా బ్రదుకునా? యను నంశము విచారింపవలసియున్నది.

స్వగురులాఘవంపాటునకు లజ్జింపక వేదీయబోధవ్యాపార తంత్రముచే బరధర్మహింసాప్రబుద్ధులై ప్రథమమునఁ జరించు నవిద్వాంసుల యెడ విసిగి తుదకు వీరు "పందులముందర నే ముత్యములు చల్లవలసి వచ్చును." మూర్ఖులను బసిబాలురను వీ రాశ్రయింపవలసివచ్చును. అకృతాత్ము లగునట్టివారియెడ వీరి యత్నములు కొంతవరకుఁ గొనసాఁగి వారు వీరికి లోఁబడి పిత్రుపైతామహమునుఁ దామవలంబించుచుండిన మతమర్యాదలను వీడి తమక్రొత్తగురువులయం దాసక్తిచే వారికి నానాకార్యముల సహాయులై యంతకుఁ బూర్వము దేశమునం దుండు రాజులను ధిక్కరించుటయందు వారికి సాయముఁ జేయుదురు. క్రైస్తవుఁడు గాని ప్రభువు క్రొత్తగ నామతము స్వీకరించినవారికి గౌరవార్హుఁ డగునా? ఇది గాక బౌద్ధమతగురువులకు భిక్షుకతా నియమ ముండెను. హిందూసన్యాసు లన్యమతస్థులను బాధించువారు కాకపోయినను వారికర్థస్వామ్యము చెల్లదు. వారు కాషాయవస్త్రములు మాత్రము ధరించి దినమున కొకసారి మాత్రము భుజించుచు గ్రామమున నొకదినము వాసముచేయుచు నేలపై నిద్రించుచుఁ గాలము గడపవలయును. విరక్తిమార్గమునందు వారిమానస్సున కలవాటుపడి యభిరుచి గలుగు వఱకు శాస్త్రనియమములే వారి యింద్రియముల నియంత్రించును. అట్లుండియు లోభాదుల జయింపఁజాలక కొంతయర్థము సేకరించి తమపూర్వాశ్రమ బంధువులకు సహాయము చేయుట యచ్చటచ్చట గోచరించి యరిషడ్వర్గబలము దురతిక్రమ మని జ్ఞాపకము సేయుచుంట గానంబడుచున్నది. పాశ్చాత్యమతగురువుల కన్ననో వారికి నియమములు నియతకర్మలు ననవసరములు. నెలకెంతజీత మైనను బుచ్చుకొనవచ్చును. బంగళాలు, గుఱ్ఱపుబండ్లు, శయ్యలు, ఆసనములు, స్రక్చందనాదులు, మాంసాద్యాహారములు సర్వము ననుభవింపవచ్చును. ఇఁక శాకాహారములలో సాత్త్వికతామసాహారము లేర్పఱచుట వారిమతమునఁ బరమచ్ఛాందసము. ఇట్టివారి కర్థవైముఖ్యము లెన్ని జన్మములకైనను గల్గునా? వీ రన్యదేశములకుంబోయి యర్థార్థులై యన్యుల కర్థపరాఙ్ముఖతనుద్ఘోషించుచు వారియర్థసంపదంజూచి "యా

దేశమున వ్యాపారము చేయుట మిక్కిలి యాదాయముగ నుండును, మనదేశపు సగ్గువమ్ములిచట సులభముగా నమ్ముకొనవచ్చును" ఇత్యాది లేఖలు, తమ బావమఱఁదులకు బంధువులకు వ్రాయుదురు. అంతట వారా దేశమునకుఁ దమ సరకులు కొండలుకొండలుగాఁ జేర్చి యాదేశపుసాలెవారికి నితర కారువులకు జీవనము నిర్మూలింతురు. తమ వర్తకమును రక్షించుకొనుటకై వారికి సైన్యము కావలసివచ్చును. ప్రజలను శాసించు నధికార ముండినఁగాని వారు నేయకుండను, నితరవస్తువులు చేయకుండను, నియంత్రించుటకు వీలుపడదు. ఆదేశమున సన్నసూలు వడకఁగూడదని మొదలయిన శాసనములు ప్రవర్తింప జేయుదురు. ఈవిధమునఁ గ్రమక్రమముగ నాదేశీయుల ధర్మమును జయించు నాసతోఁ బోయి, వారియర్థమును జయింతురు. అనేకస్థముల నర్థహీనులై జనులు జాతులు జాతులుగాఁ బ్రాణముసైతము గోలుపోవుటయుఁ గలదు. అమెరికాయందలి శోణాంగులును, గ్రీన్‌లాండునందలి ఎస్కిమోలు కొందఱును ఆస్ట్రేలియాయందలి యనేకాటవిక కిరాత జాతులు నీవిధముగా నిర్మూలమైన వారే యని చరిత్ర మెఱింగిన వారికెల్లఁ దెలిసియె యున్నది. క్రైస్తవాది పరధర్మజిగీషాపరు లగు జాతులవారు దురభిమానమానసులు గాక త్వరలోఁ బరధర్మజిఘాంసువు లగుచున్నా రనియుఁ, బరదేశాదేశనియమము లేక పరార్థజిఘాంసు లగుచున్నారనియు, ధర్మార్థచ్యుతు లగుదుర్బల జాతుల కామమును సైతము వీరు బాధించుటచేఁ బరకామహింస వీరి తప్పనితలవ్రాఁత యనియు బౌద్ధభిక్షుకులనాఁటినుండి యీనాఁటివఱకు నేర్పడుచున్నది. భిక్షుకవేషధారులైన బౌద్ధులకు జావా మొదలగు రాజ్యముల నధివేశించుట తప్పెనా, లంకారాజ్యమును జయింపకుండుటకు సాధ్యమాయెనా? క్రైస్తవులెన్నిజాతులవారిని జయించిరి? మహమ్మదీయులెన్నిజాతులవారిని జయించిరి? ఈమార్గమునఁ బరదేశాక్రమణముం గూర్చి చైనావారు "మొదట మతబోధకుఁడు, వెనుక రాజదూత, తుదను సేనాపతి" యనుసామెత చెప్పుకొందురఁట. "First the missionary, then the consul, then the general."

ఈ క్రమమున వారియాక్రమణనాటకమునఁ బాత్రప్రవేశము జరుగు నని యీసామెత యభిప్రాయము. ఒక్కొకరే యీమూఁడు పాత్రములుగ నటించిన యసహాయశూరు లగుమహాత్ము లనేకులు గలరనియు వారిలోఁ గీర్తిశేషులయిన డేవిడ్ విలింగ్స్టన్ అను విఖ్యాతనాముఁ డొకఁడనియుఁ దెలియుచున్నది. ఈ విలింగ్స్టనుచరిత్ర పసిబాలురకుఁ బఠనీయమై యీతఁడు లోకోత్తరచరిత్రుఁడుగ నుద్ఘోషింపఁబడుచున్నాఁడు. ప్రస్తుతదురోన్మహాస్థితియం దెంతటి పాశ్చాత్యుని ధీరోదాత్తునిగ స్వీకరించుటకు లజ్జితుంమో చెప్పఁజాలను.

ధర్మచ్యుతి గలిగించుటచేఁ ద్రివర్గచ్యుతి * యనివార్య మని చక్కఁగ నెఱింగిన యార్థికు లకల్మషులగు మతబోధకులను దమదుర్నీతులయందుఁ బ్రయోగించుటకు సంకోచింపవలయు పనిలేదు. తా మెంతమాత్రము విశ్వసింపని మతము నితరులకు బోధించుటకై గొప్ప జీతము లిచ్చి మతబోధకులను బరమతాక్రమణమునకై విడుచుట యెంతటిపాతకమో దురూహము. మతబోధకులకుఁ గూడ స్వమతమగు క్రైస్తవమున విశ్వాసము లేకయు జీతము కొఱకై శ్రమపడుటయు, రాజ్యకాంతిచేతను వ్యాపారాదాయము కొఱకును క్రైస్తవాది మతములను దామునమ్మక యొరులకు బోధించునట్టియు బోధింపించునట్టియు మహాత్ముల దుష్కర్మములు పెచ్చు పెఱిగి శ్రద్ధధానులగు వారిహృదయములం జీల్చుటయుఁ జార్వాకపాషండాది కుమతముల వారు సైతము నీజాతిబోద్ధలను గర్హించుటయు సంభవింపక మానవు.

అవిశ్వాసముచే భగవంతుని నలజ్జచే మానవుని దిరస్కరించి పరజాతిదేశాతిక్రమణమున వర్తించు ధర్మధ్వజు లగు నార్థికులకుఁ బరభాషానిర్వాపణము పరమోపకారకమై యున్నది. నేఁటివఱకు హిందువు లనేకజాతులవారివలన జయింపఁబడి తమరాజ్యమును ద్రవ్యమును గౌరవమును బోఁగొట్టుకొనిరి గాని తమమతముల యందు వారివిశ్వాస మచలముగా నుండెను. వేదాంతము నవలంబించిన బ్రహ్మోపాసకునికిఁ బరమతవిచారము పుట్టతేనె రుచిఁజూచినవానికిఁ

---

* ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేష నచ కశ్చి చ్ఛృణోతిమాం । ధర్మా దర్థశ్చ కామశ్చ సధర్మః కిం న సేవ్యతే - మహాభారతము.

డాటిబల్లము వలెఁ గానిపించెను. అయినను నుపాసకుని దొందర పెట్టఁగూడదనియు నేవిధముగ నుపాసించినను గరుణామయుఁడు నుపాధిరహితుఁడు నగు భగవంతుఁ డాదరించు ననియు నమ్మినవాఁ డగుటచే నితరులను వారియుపాసనయందె గౌరవించుచుఁ దన్నుఁదనయుపాసనయందె గౌరవించుకొనుచు ననపాయవ్రతియై చరించెను. తనతలవాంచిన వాఁడును గాఁడు. తలవాంచు మనియపేక్షించినవాఁడును గాఁడు. ఇండియా దేశమందు వేలకొలఁది సంవత్సరములుగా నెలకొనియున్న యీ వేదాంతశాస్త్రమునం దధునాతన జర్మనుపండిత చక్రవర్తులగు మ్యాక్స్‌మూలర్ మొదలగు మహాశయు లనేకులు ప్రపత్తి గలవా రగుట మనము పోయి వారిని నిర్బంధించుటచేఁ గాదు. వారిని మనము తాంబూల మిచ్చి పిలిచినది లేదు. * మనభాష చదివినందున వారి కుద్యోగమురాదు. అట్లుండియు వారు స్వయముగ జిజ్ఞాసువులై మనదేశీయు లగుపండితులను బతిమాలి బతిమాలి తమశిష్యత్వమున కర్హతను నిరూపించిన వెనుకనె తమకుఁ దెలిసినమట్టుకు బోధించిరి. ఇట్టి వేదాంతులు దేశమున లక్షలకొలఁది నుండగా నలువది లక్షల క్రిస్టియనులు మనదేశమున నేర్పడిరి. గతసంవత్సరము మనయాంధ్రదేశమున నైదువేలమంది క్రైస్తవముపుచ్చుకొనిరఁట! ఈరహస్యమేమి?

వేదాంతిని వేలువంచుట సాధ్యముకాదు గాని వానికుమారునకా వేదాంతబలము లేకుండఁ జేయవచ్చును. తెలిసినవారిని మెప్పించుట కష్టముగాని చదువురానివారిని లాగవచ్చును. భాషానిర్మాపణము బాలిశాశ్రయము నీరెండును వజ్రాయుధములు. ఈ రెంటియందును మొదటిది శ్రేష్ఠతరమైనది. తెలిసినవారి కుమారులను బూర్వానుసృతమార్గస్థాపకమైనట్టియుఁ జతుర్వర్గఫలకమగునట్టియు భాషనుండి తొలఁగించి దానితట్టు వారిని దొంగిచూడనీయక, సాధ్యమైన మట్టుకు వారిని మరలించుచున్న యెడల వారిమన స్వభాషయెడ వీతరాగ మగును.

---

* "జ్ఞానే మౌనం" "మౌనవ్యాఖ్యా ప్రకటితపరబ్రహ్మతత్త్వం" ఇత్యాది వాక్యానుభవము "ఇంటిపై కెక్కి తమమతము నఱచు" వారికిఁ గలుగుట కెన్ని వందలసంవత్సరములో పట్టును.

బిడ్డలను వశము చేసికొనవలయును. తమవిద్య వారికిఁ గఱపవలయును. వారి కేమిచెప్పినను సహేతుకముగాఁ జెప్పవలయు నవసరము లేదు. ఎంతయన్యాయపు విషయమైనను సత్యముగా గ్రహించుటకు వారి బాల్యమే హేతువు. అట్టి బాల్యమున మనస్సున నాటినయభిప్రాయము లెంతచెడుగులైనను వెనుక నశింపవు. "నవభాజమున లగ్నంబవు సంస్కారంబు పొలియ" దని నీతిచంద్రికాకారుఁడు చెప్పియున్నాఁడు. తనకుమారుని స్వభావమెఱుంగలేకపోయెను గాని హిరణ్యకశిపుఁడు లోకమునందలి బిడ్డల సంగతి.

"ఎట్లాడిన నట్లాడుదు, రిట్టిట్టని యెఱుఁగనేర రెల్ల శిశువులున్." అని చక్కఁగనె చెప్పెను. విష్ణుమూర్తికిఁ దాను జన్మశత్రువైనను దనముద్దుకుమారుని మౌగ్ధ్యము, దుర్మార్గులు విష్ణుభక్తి బోధించుట కవకాశ మని రక్షోనాథుఁడు నమ్మెను. ఎంతబుద్ధిమంతుఁడైనబాలునైనను మీతండ్రి చండాలుఁడని బోధచేసి నమ్మింపవచ్చును. అతని బహిరంగముగను నిర్లజ్జునుగను నతండు పెద్దవాఁడైన వెనుక నైతము నామాట యనిపించి సంతోషింపవచ్చును.

తమ వ్యాప్త్యభిలాషచేతను, వశీకరణాభిలాషచేతను నుపజాపాసక్తిచేతను దేశీయులకు దేశవిద్యనిలిపి తమవిద్య గఱపుట కప్పటిప్రభుత్వము వారును వారిసహాయు లగు మతబోధకులును నిర్ణయించిరి. అయినను నీతిప్రవీణులుగనుక బహిరంగముగా, మనవిద్య చెప్పుదుమా వారివిద్య లే చదువుకొమ్మందమా! అని సాటోపముగాఁ జర్చించి, అబ్బబ్బ మనవిద్య వారికిఁ గూడదు, వారుస్వాతంత్ర్యాభిలాషు లగుదురు. ఎంతమాత్రము కూడదు. అని చర్చాభాసములు పెంచిరి.

మెకాలే యనుమహనీయుఁ డీవిషయము నిర్ణయించుమంత్రిగా నుండెను. ఆయన మెఱుఁగుగా, మనవలన విద్యనేర్చుకొని తమరాజ్యము తమకుం గావలయు నని కోరినచో నంతకంటె నెక్కుడు గౌరవము మనకుం గలదా? రాజ్యశాస్త్రము తెలియనియీయనాగరకులకు స్వరాజ్యపద్ధతుల నేర్పి యాత్మరక్షణము చేసికొనుటకు సమర్థులనుగా మనము చేయఁగలుగుదుమేని మనజాతికంతకంటె నర్హాకృత్య ముండఁ

బోదని వచించెను. నీశిష్యుల మని శరణుసొచ్చినవా రాత్మస్వాతంత్ర్య మును దేహస్వాతంత్ర్యము నేక కాలమునఁ ద్యజించుచుండఁగా లోలో పల సంతసించుచు నీకు స్వాతంత్ర్యదానము పై జన్మములోఁ జేయు దునని గురువు చెప్పుట శిష్యుఁడు నమ్ముట ! గురువులం దత్యంత ప్రి పత్తిగలవారు గదా హిందువులు. అయిన నింగ్లీషువిద్య గఱపుటచే హిందూజాతివారు నల్ల చర్మము గల యింగ్లీషువార లగుదు రనియు, వారిస్వాతంత్ర్యము స్వాభిమానము నిర్మూల మగుననియు స్వభాషల యందే వారిని గాలానుసరణముగఁ బెరుఁగనిచ్చినఁ గావలసినమాత్రము నవీనసిద్ధాంతములు తమప్రాఁజదువులకుఁ జేర్చుకొని తమనెలవులు దప్పని కమలములవలె నొప్పియుందు రనియు దేశభాషల సాహాయ్య మున నవీనాభిప్రాయ స్వీకారము జాతీయవిద్యావ్యాపనము దశగుణ ముగ జరుగు నని ఐరోపీయనాగరకమును విద్యయు నొక్క యాంగ్లే యులవలననే యుత్పత్తియైనది గాదనియు జర్మనులు ప్రెంసువారు నాంగ్లేయులకన్న శాస్త్రనైపుణియుఁ గలానైపుణియు ద్విగుణముగాఁ గలవారై యుండినను నాంగ్లేయులు తమభాషయు విద్యయు సన్న్య సింపక జర్మను ఫ్రెంచి మొదలగుజాతులవారి నవీనసిద్ధాంతముల నా యాభాషలు స్వదేశ విద్యాపూర్ణత కాభరణముగా నభ్యసించిన కొద్ది మంది పండితులచే స్వభాషాసీతములు గావించి తమసంప్రదాయ విద్యకు మెఱుఁగువెట్టికొని రనియు నేతద్విపరీతముగాఁ జేయుట యా త్మహత్యాప్రాయ మనియు మెకాలె మొదలగు నీతిసారంగతులకుం దెలియకుండెనా ? నమ్మఁజాల, ముమ్మాటికి నమ్మఁజాల. ఒకానొక రెవ్వరో పర్షియా ఇండియా చైనా మొదలగు ప్రాచ్యదేశములయందు గ్రంథసర్వస్వమెల్లను నొకచిన్న బీరువలో బట్టఁదగిన యైరోపీయ గ్రంథ ములకుఁ దుల్యము గాని పెంట యని యీమెకాలెకుఁ జెప్పి రఁట ! ఆ చెప్పినవాఁ డెంతటిమూర్ఖుఁడో, దాని నమ్మిన మెకాలె యెంతటి సాహసుఁడో; తాను జన్మాదిగ నేర్చిన యైరోపీయవిద్యా పారంగతత్వ మున కన్యజాతులవారి గ్రంథములలో నొకపుటయైనను జదువక యిం తంత సిద్ధాంతములు నిశ్శంకముగా స్థాపించుట యెంత గౌరవమో ? ఎవరు చెప్పఁగలరు ? ఇంతటి దురభిమానము నింగితజ్ఞానరాహిత్యమును

వారికిఁ జెల్లునే కాని యన్యులకుం జెల్లునా? కాలిఫ్ ఓమారు కురా నుకంటె నన్యగ్రంథముల నేమియు విషయ ముండఁజాల దని నిశ్చయించి లక్షలకొలఁది గ్రంథములు గల యలెక్సాండ్రియా గ్రంథావళిం దగుల బెట్టె నని ప్రతీతి గలదు. ఈకథ విశ్వాసార్హము గాదని కొందఱు వాదించుచున్నారు. ఇండియాదేశమువారి గ్రంథములు నిస్సారములని సిద్ధాంతించి యాచదువు మెకాలె నిలుపుదల చేయించెను. ఈకథ వాస్తవ మని యొప్పుకొనక తప్పదు.

ఐరోపీయ రాజ్యముల కెల్ల ద్వైగుణ్య * (సంధివిగ్రహశాస్త్ర) ప్రథమగురువగు గ్రోషియసు మానవుని స్వాతంత్ర్యము విక్రయవినిమయార్హ మనియుఁ దనస్వాతంత్ర్యమును సమయమువచ్చినపుడు వ్యవహారవిషయముగాఁ జేయవచ్చు ననియుఁ జెప్పియుండిరి. ప్రాణాపాయము గల్గునెడఁ ననఁగా యుద్ధమునందు శత్రువులచేఁ జిక్కి ప్రాణములు గోలుపోవలసివచ్చినపుడు గోలుపోవుటకు మాఱుస్వాతంత్ర్యముఁ ద్యజించి దాసత్వము స్వీకరింపవచ్చునని వారు సిద్ధాంతించిరి. ధర్మము దయాపూర్వకము గదా. ఫ్రాంసుదేశీయుఁడగు రూసో మాత్రము మానవస్వాతంత్ర్యము వ్యవహారాతీత మనియుఁ బ్రాణము పోనున్నను బ్రాణాధిక మైన స్వాతంత్ర్యము పోఁగొట్టుకొనుట న్యాయము గాదనియుఁ దనస్వాతంత్ర్యము గాని యన్యులస్వాతంత్ర్యముగాని యవిక్రేయ మనియు శాసించెను. ఈయనుశాసన బలమువలననే యూరపునందు దాస్యము నిర్మూలమై మనుష్యజన్మముయొక్క యౌన్నత్యము దశగుణ మయ్యెను. ఎవరిమతము నాచారములు వారవలంబింప వలయునే గాని యన్యధర్మము స్వీకరించుట గాని తనధర్మము నన్యులతలపైఁ బెట్టుట గాని యుభయధర్మ హింసక మని యనాదిగ హిందువులు నమ్ముచుండిరి. ఏబాలుని గాని పిత్రుపై తాపహాముగ వానికుండు మత వేష భాషాచారములఁ బెఱుఁగనీయవలయునే గాని స్వధర్మ

---

* సంధివిగ్రహ యానాసనద్వైధీభావ సంశ్రియాత్మకమగు షాడ్గుణ్యమును సంధివిగ్రహరూపద్వైగుణ్యమే యని వాతవ్యాధి వాదించెను. ఇదియే పాశ్చాత్యుల యభిప్రాయమై యున్నది.

మునకు వాని నెడఁబాపుట కేవల భూతదయాపక్షమున యాజించినను గూ్రకర్మ మనుసిద్ధాంతము హిందూ జాతివలన లోకము నేర్చుకొన వలసి యున్నది. గ్రీషియసు ప్రాణము రక్షించెను. రూమ్సా దైహిక స్వేచ్ఛ యొసంగెను. ఆధ్యాత్మిక స్వేచ్ఛ హిందూ వేదాంతులు కలుగఁ జేయవలసియున్నది. స్వధర్మరతి వేలకొలఁదిసంవత్సరములుగ వారి సిద్ధాంతమై యున్నది. వేయిసంవత్సరముల క్రిందట గుజని మామూదు తమ దేవాలయములు నాశనము చేసినను నేఁడినము మహమ్మదీయుల కాలిఫ్ స్థానమున కపాయము రానున్నపుడు మహమ్మదీయులకు బాధ కలుగఁజేయఁగూడ దని పోరాడిన సత్యేంద్రసింహుడును బికనీరు ప్రభువును స్వధర్మనిరతి శాస్త్రము చక్కఁగ ననుష్ఠించిన వారైరి.

తత్వాన్వేషకులును దర్క జిగీషువులు నగువిద్వాంసులు కొందఱు మతవాదము పెట్టుకొనుట గలుగవచ్చును. అట్టిచోఁ బరమతావలంబులును మూఢాత్ములునగు బాలిశులను బీడింపక యన్యమతగురువును ప్రధానుఁడు నగు వానిని దర్కమునకుఁ బిలిచి వానితో వాదించినఁ జాలును. అట్టివానివలన నేర్చుకొన్నను నట్టివానికి నేర్పినను గౌరవమే. ఈపద్ధతి క్రైస్తవబుద్ధులకుఁ గేవల వాలుకాపీడనమై మాత్స్యన్యాయమున నల్పసత్త్వముల దిగమ్రింగుట కారంభించిరి.

స్వజాతిధర్మవేషభాషాచారప్రాముఖ్యపూర్వకమగు బలాత్కృత పరజాతిసంస్కారము మారణకర్మకంటె ననన్యము. ఈ తత్వము చక్కఁగ నెఱింగియుండియే యాటవికులకు భిల్లులు మొదలగు కిరాత జాతులకు నిర్గుణబ్రహ్మతత్వము నమనస్కప్రకరణము నేర్పినవారు కారు. వివాదములయందు వారివారి మర్యాదల ననుసరించియే న్యాయనిర్ణయము చేసికొనవలయునని యందఱు స్మృతికారులు శాసించియున్న వారు. వారీనాఁటికి భార్యలు బిడ్డలతో సుఖజీవులై యున్నారు. దీనికి బదులు వారికి నిరాయుధీకరణశాసనములు నిర్ణయించి వల్కలములు మాని మా సాలెవారు నేసిన వస్త్రములు కొనవలయుననియు వారిలో నెవరైనఁ గుశాగ్రబుద్ధులు సన్ననూలు వడికిన యెడల నట్లు చేయఁగూడ దనియు నిర్బంధము చేసి దుర్బలజాతిమారక మడార్వినీయసిద్ధాంతము

సహాయముగొన్నయెడల నెప్పుడో చచ్చియుందురు. కిరాతవృత్తియం దున్నను నొకానొకఁడు జిజ్ఞాసువై గుర్వన్వేషణచేసికొని కడతేరిన కథలును గలవు. బహుళవిద్యాశాస్త్రసంపన్నమును, నానాశస్త్రాస్త్రశిక్షితంబును, శౌర్యధైర్యాది పరాక్రమ గుణవిశిష్టంబును, నపరిమిత సంఖ్యాకంబు నగు గొప్పజాతి సన్నికర్షమున ననాగరక కిరాతాటవిక జాతులు నిష్కారణముగనె వినాశము వొందును. వాని సంస్కారము పూనుకొన్నయెడల మృత్యువు వేఱుగ నవసర ముండదు. స్వవృత్తియందు వానికి భంగముగలుగనీయక స్వధర్మమునకుఁ గొఱవడనీయక గౌరవించి బ్రదుకనిచ్చుటకు హిందువులకు సాధ్యమగునేగాని యన్యుల కగునా ?

సింహము లేనుఁగులు మొదలగు వనమృగములను గ్రామములకుం దెచ్చి పోతులను పెంటియలను బరస్పరము సమకూర్చియు, మాంసాద్యాహారములు పుష్కలముగ నిచ్చియు నుపభోగముల కేవిధమైన కొఱఁతయుఁ బడకుండఁ జేసినను నా సత్వములు చావనైనను జచ్చును. లేదా దుర్బలములై రోమములూడి క్షీణజవసత్వములై మృత్యుసహాచర మనం దగు దుర్భరహ్రాసముం జెందనైనం జెందును. ఈ బలాత్కారసంస్కారము నెంతదయాపూర్వకముగ నారంభించినను, నెంతదయాసహితముగా నిర్వహింపఁబడినను దానివలని కీడు తప్పదు.

స్వజాత్యుచిత సాంప్రదాయికవిద్య కభావముగల్పించి దురాశాబద్ధులమై మన జాతిబాలుర నన్యమతస్థులకు నన్యభాషలకు విడిచిపెట్టుటచే మన జాతికి సంఘాతమృత్యువు సంభవింపకున్నను హ్రాసము తప్పదు. బుద్ధివైభవము నశించుటయు, వాక్పాటవము తగ్గుటయుఁ బ్రతిభావినాశము, నాయుఃక్షయమును, దేహదౌర్బల్యమును బారతంత్ర్యబుద్ధియుఁ దప్పవు. ఇప్పటికే కావలసినంత యనుభవమై యున్నది.

మున్ను నేను మనవిచేసియున్నరీతిని బరమవిద్యాగర్వముచే దులఁదూఁగుచుండిన హిందువులు చ్యుతవ్రతులై ధనాశచేతను దారిద్ర్యముచేతను మఱి కొన్నికారణములచేతను స్వభాషలం బరిత్యజించి

తెల్లవారి పాదములకడ శుశ్రూషచేయుటకై తమ బాలుర నంపిరి. పార్థివాశ్రయాధీనులై కొంతవఱకు, నింద్రియపరవశులై కొంతవఱకును దైవవైపరీత్య మీరీతిం బరిణమించెను.

ఏతద్దేశప్రసూతస్య సకాశా దగ్రజన్మనః
స్వంస్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః *

అని లోకైకగురువులుగా ననుశాసింపఁబడిన బ్రాహ్మణులు తలవాంచిరి. ఆకాలముననే ఇంగ్లాండువారి శాశ్వతగురుత్వమును భారతవర్షీయుల శాశ్వతశిష్యత్వము ననుల్లంఘ్యముగ నంగీకరింపఁబడెనుగదా? వేలకొలఁది సంవత్సరములు మనదేశీయులు ఇంగ్లీషు చదివినను వీరికి వాఙ్మయనిర్మాణాధికారము గలుగదు. మొదటితరగతి బాలురకైనను సీములోని ఇంగ్లీషువారు వ్రాసిన కోడిపిల్లకథలే యుక్తములుగ నుండునుగాని మనదేశీయులు పఠనీయగ్రంథకర్తలు గాఁజాలరు. కేవల కథావస్తుప్రధానములు నైతిహాసికగ్రంథములును, శాస్త్రగ్రంథములును వీరు కొన్ని యత్నించినను, వానియందలి భాష పరిహాసాస్పదముగ నుండును. భాషాదృష్టిచే నీగ్రంథములు దోషభూయిష్ఠములుగ నుండును. ఈ విషయమున మన మవమానపడవలయు నవసర ముండదు. ఇంగ్లీషువారివలె మంచినీళ్ళప్రాయముగా మాటాడుటకును మనకు సాధ్యముగాదు. మనదేశీయులగు నెంతటి ఇంగ్లీషు విద్వాంసు లింగ్లాండునకుఁ బోయినను వీరిభాష పాండిత్యప్రకర్షము కొఱకుఁ బనికివచ్చునేగాని జాత్యప్రయోగ లాలిత్యమాధుర్యాది గుణసంపన్నమై యుండదు. ఇంగ్లాండువారి సంతానమయ్యును ఆస్ట్రేలియా అమెరికా మొదలగు నధినివేశముల నుండువారియందు గొప్పకవులు గాని గ్రంథకర్తలు గాని జన్మింపక పోవుటయు నా భాషకుఁగల సహజవికాససౌభాగ్యము, ఈ యధినివేశములందు లేకుండుటయు లోకవిదితమే తమదేశము విడిచిపెట్టి ఇండియా దేశమున రెండు తరముల కాలము నివసించినవారు గ్రంథ నిర్మాణముః

---

* ఇతరజాతు బ్రాహ్మణులను జూచి నేర్చుకొందురని యనెకాని వీరు మిమ
[illegible]

కనర్హు లగుచున్నారు. మ్యాక్సుమూలరు మొదలగు విద్వాంసు లెన్ని యేండ్లు సంస్కృతము చదివినను గ్రంథహృదయము కనుఁగొనుటే వారికి దుర్లభము. సంస్కృతమున నొకవాక్యముగాని యొక్కశ్లోకము గాని వ్రాయఁజాలరు. సంస్కృతభాష మాటలాడుట వారికి సాధ్యమే గాదు. హిందూదేశపండితుల యెదుటఁ గనబడుటకు వారామరణాంతము జంకుచునే యుండిరఁట!! మనదేశములం దాఁడువారు వ్రాసిన సంస్కృతకావ్యము లతిప్రౌఢము లెన్నియో గలవు ఈకారణముననే యింగ్లీషుభాషయందు మనకు శాశ్వతశిష్యత్వమును వాఙ్మయదృష్ట్యా ఫలశూన్యత్వమును దప్పవు. ప్రతిజాతికి స్వభాషయం దంతబలమును బరభాషయం దంతదౌర్బల్యమును గలవు. ఈనిరంతరశిష్యత్వము మన జాతి కధమస్థానముఁ గూర్చునే గాని యధికస్థానముఁ గూర్పదు.

ఆదినుండియు విజాతివిద్య నారంభించువారిదుర్గతి వర్ణించుట కడుంగడు దుఃఖకరము. వారిపెద్దలమర్యాదలు వారిజ్ఞానము వారిచరిత్రయు వారి కెంతమాత్రమును దెలియవు. వారికిఁ దెలిసిన జ్ఞానులు, కవులు, యోగులు విద్వాంసులు, శిల్పులు, వేదాంతులు, త్యాగులు, నీతివిదులు, బలిష్ఠులు, యోధులు, శూరులు ధనికులు, ధార్మికులు నన్యదేశీయులే. వీరినే వారెల్లపుడుఁ బ్రమాణీకరించుట. వారివచన్సరణియు వారిమర్యాదలు నన్యదేశీయములే. వారుప్రయోగించుప్రాస్తావికవాక్యములుఁ జమత్కారవాక్యములు నర్థాంతరన్యాసములుఁ బరదేశీయములే. వారి కీదేశపువిద్యలు మిథ్యలు, విద్యలేలేవు. జ్ఞానమేసున్న, ఈదేశపుఁ బూర్వులగు ఋషులు వేత్తలు మూర్ఖులు. వాల్మీకి వ్యాసకాళిదాసాదులు మనదేశమున నుంటయే వారికిం దెలియదు. తెలిసినను ఆంగ్లభాషోచ్చారణచే వికృతనాములై "Homer of India" "Shakespeare of India" ఇత్యాది పాశ్చాత్య కవిప్రామాణ్యపూర్వకము లగునామములందె! హోమరుకావ్యము మన దేశమున ననేకులు చదివి యుండఁజాలరు. వారి కావ్యమునఁ గథానాయకుఁ డగుమెనిలాసు కేవలదుర్బలుఁడై యుండ నాతనిభార్యయుఁ గథానాయికయు నగు "హెలెను" అనుతరుణి బుద్ధిపూర్వకముగాఁ దనకు నుపపతిగా వచ్చినవాని ననుసరించి తనభర్తను మోసపుచ్చి

యిల్లు వెడలి పోయిన పాంసుల యనియు, నీగుడిసె వేటు భార్యను విడువఁజాలక తనయన్నయు, అకిలీసు మొదలగు వీరులతో యుద్ధమునకై బయలుదేరె ననియు, యుద్ధసమయమునకు నాయకత్వము వీరిం బరిత్యజించె ననియుఁ బై అకిలుసు అగమెన్నను మొదలగువీరులు కేవల పారదారికు లగు క్షుద్రులనియు నీపాత్రములను వీరిచరిత్రములను వీనిరచించినకవినిఁ బ్రమాణీకరించుకొని సమస్తలోకోత్తరకల్యాణగుణ విశిష్టులగు శీతారాముల చరిత్రను భువనత్రయపావన మగు రామాయణమును దత్కర్త యగు వాల్మీకిని బరిగణించుచున్నా మనియు నెఱుంగుటకు లజ్జింపని మనము దేనికి లజ్జింతుము? సీతను వదలి హెలెనును ఇండియావారు స్వీకరింతురా? అని నివేదితాసోదరి మొన్ననే యడిగియుండెను. ఈకాలమునఁ గుశాగ్రబుద్ధులలో నొకరును బ్రిథానస్వదేశ రాజ్యములలో నొకదానియందుఁవిద్యాధ్యక్షపదవియందు గీర్తివహించిన వారును నగునొకమహామహులు మనదేశాస్త్రములం గూర్చి "మనవారిధర్మశాస్త్రము లెంత ధర్మశూన్యములో యర్థశాస్త్రము లంతయర్థవిచారశూన్యము" లని వ్రాసియుండిరి. ఇంత జంకుకళంకు లేక వ్రాయుటకుఁ బరదేశమిషనరీలుసంకోచింతురు, గాని, వారిశుశ్రూషచేసిన మనదేశీయులు లక్ష్యముచేయరు భాషామూలకవశీకరణమున కెంతటిమహోదయము!

ఈవిధమునఁ గ్రమక్రమముగ మనజాతి తనయాత్మను ధ్వంసము చేసికొనుచున్నది. స్వభాషాపోషితు లగువారి కిట్టివినాశము గలుగఁజాల దనుటకు ముందు తమవిద్యలలోఁ బారంగతులై వెనుకఁ బరదేశ విద్య లభ్యసించిన నూర్లకొలఁది పాశ్చాత్యపండితులే ప్రమాణము. వారిలో నొకరిద్దఱు స్వమతాభిమానము వదలి వేదాంతమతము స్వీకరించినను గృతాత్ములైన స్వతంత్రు లగుటచేత మనకుఁ బాతకమాపాదింపఁజాలరు. బాలిశులను, బసిపాపలను రోగిష్ఠులను మతాంతరము స్వీకరింపు మని చెప్పువని మనదేశీయుల కెన్నఁటికిని రాకుండునుగాక. శ్రీరామకృష్ణసంఘము వా రగుసన్న్యాసులు స్వమతప్రచారకులై అమెరికా మొదలగు దేశములందు సంచరించుట యచ్చటివారు వీరి నాహ్వానించుటచే ననియు మనదేశమునందు జరుగుచున్న

మతాక్రమణ భాషాక్రమణములకుఁ బ్రతీకారముగాననియు నూహింపవలసి యున్నది. వీరు ఆదేశమునఁ బండితులగువారినే యభియోగింపవలయును. వీరి కా దేశీయుల కుద్యోగము లిచ్చు నధికారము గాని, మందు లిచ్చు శక్తిగాని యేవిధమైన యాదాయము కలుగఁజేయుశక్తి గాని యిప్పటికి లేదు. ఇఁక మీఁదటఁ గలుగవచ్చును. ఎట్లన: అమెరికావారు ప్రస్తుతము వేదాంతమునందుఁ జూపు గౌరవములో నొకానొకదినమున వేదాంతాభిమాని యగు నొకఁడా దేశమున (ప్రసిడెంటు) కధ్యక్షుఁ డయ్యెననుకొనుఁడు. అతని పక్షపాతము సంపాదించుటకై తదనువర్తులును భగవద్గీత పట్టుగుడ్డలోఁ గట్టించి చేతఁ బట్టుదురు. అచ్చటి సర్వకళాశాలలయందుఁ దత్త్వశాస్త్రాచార్యులు, అధ్యాత్మవిద్య నమ్మినయెడల వారు తమ శిష్యగణమునకు బోధింతురు. మన దేశపుఁ బురుషులయందు గౌరవము లేకున్నను మనదేశపు స్త్రీల పాతివ్రత్యమును సద్వర్తనమును గణనాతీతములని యేకగ్రీవముగఁ బాశ్చాత్త్యు లంగీకరించియున్నవారు. స్త్రీపురుషులవివాహము కేవలము నీదేహములకు సంబంధించినదిగాక యెన్నిజన్మములకు నుత్తములగు భార్యాభర్త లవ్యభిచారులై యుందురని హిందువులనమ్మకమైయున్నది. అమెరికాదేశపు స్త్రీ లేకపత్నీవ్రతము స్వీకరించి యొకరిద్దఱు భర్తృవియోగము గల్గినపుడు ముండన మారంభించినయెడల వేలము వెఱ్ఱిగా నందఱు నారంభింతురు. అమెరికాయందు స్త్రీలు రాజకీయవిషయములయం దధికారిణులై యున్నారు. వారియభిమానముతో నమెరికాయందెట్టికార్యములైనను సాధింపవచ్చును. కావున రామకృష్ణ మిషన్ సన్న్యాసులు సైతము అమెరికావారిధర్మమును బాధించువిషయమున రాగద్వేషములకు నెడమీయకుండవలయును. మనదేశమునకు వచ్చిన జిజ్ఞాసువులకుమాత్రము వేదాంతోపదేశమునకు వీలు గలుగఁజేసినఁ జాలదా ? అది యట్లుండె.

మన భాషలయందు నవీను లారోపించు లోపములెల్ల నజ్ఞానజన్యములేగాని వేఱుగావు. శాస్త్రగ్రంథములు, అనఁగాఁ బ్రకృతిశాస్త్రగ్రంథములు వ్రాయుటకు మనవారు పూనుకొనవలయునేగాని శబ్దజాలమునకుం గొఱతయుండదు. పరిభాషాకల్పనకుఁ బాణినీయ మనంత

సహాయకరము. ఎంతశ్రమమైయున నోర్చి భాషను బోషింపనియెడల జాతిహత్య చేసినవార మగుచున్నారము.

"మ్లేచ్ఛభాషాం న శిక్షేత"—చాణక్యసూత్రము. ఈశాసనము యొక్క వ్యాప్తి నారయవలయును.

కొమాండూరి కుమారస్వామిశాస్త్రి.

పరిషత్పుస్తకభాండాగారము.

తపతీపరిణయము.

ఇదియొక తపతీసంవరణోపాఖ్యానము. ఇది సంపూర్ణముగా దొరకలేదు. కృత్యాదిపద్యములు, ఆశ్వాసాద్యంతపద్యములు గద్యము విడిచిపెట్టి యాశ్వాసములుమాత్రము కలిపివేయక విడివిడిగా నెవ్వరో వ్రాసికొన్నది. కవిపేరు తెలియదు. కృతిపతినామము మున్నగు చారిత్రోపయుక్తాంశ మింతయుఁ గానరాదు. ఇట్లున్నను, అచ్చువడిన తపతీసంవరణోపాఖ్యానముకాదు. అచ్చుపడని తపతీసంవరణోపాఖ్యానమును గాదు. దీనిసంగతి యచ్చుపడని క్రొత్తది యని తెల్లమగుచున్నది. అచ్చువడిన తపతీసంవరణోపాఖ్యానము అద్దంకి గంగాధరకవిది. అందుఁ గథాప్రారంభమును గవి యిట్లు చేసినాఁడు.

సీ॥ కాంతేయులేకచక్రనివాసులై యుండి యజ్ఞసేనసుతాస్వయంవరంబుఁ
గనువేడ్కఁ బాంచాలజనపాలుప్రోలికి నక్తందివప్రయాణముల నరుగ
నర్ధరాత్రంబున నంగారపర్ణుండు మధ్యమార్గంబున మారుమలసి
నరుచేత నాగ్నేయశరబాధ్యమానుఁడై తాపత్యకులదీప దయదలిర్చి
నన్ను మన్నింపుమనిన గంధర్వవిభుని, కథయ మొసఁగి ధనజయుం [డనఘ తపతి
కులసముత్పత్తితమ కెట్టుగలిగెననఁగ, నాకథాకథనేచ్ఛనిట్లనియెనతఁడు॥

ఈ క్రొత్తపుస్తకములో నిట్లు ప్రారంభము చేసినాఁడు.

గీ॥ ఏకచక్రముగా ధరయేలఁదలఁచి, యేకచక్రపురంబున నెనయు వేడ్క
విప్రధర్మంబుచేఁ బాండవేయులుండి, విప్రధర్మసహాయులై వెడలి నిసిని॥

శా॥ ప్రీతిం గృష్ణస్వయంవరార్థికయి కాంపిల్యంబుఁ జేరంగఁ బో
వా త్రోవం దగుజాహ్నవీతటమునం దంగారపర్ణాఖ్యవి
ఖ్యాతుం డొక్కఁడు కామినీసహితుఁడై గంధర్వుఁ డడ్డంబురాఁ
గా తద్గర్వము ఫల్గునుం డడరి యుగ్రస్ఫూర్తి వారించినన్॥
క॥ చిక్కియుఁ బాండవమధ్యముఁ, దక్కక చేరంగఁబిలిచి తాపత్యులుమీ
రిక్కరణి రాత్రివత్తురె, యక్కజమిది శౌర్యధుర్యులగుటకుమఱియున్.

బి రు ద ము ల వి లు వ.

శా॥ "రెండా నాల్కలు సంప్రదాయకులకున్"

ఆర్యులార ! ఇక్కాలమున ధాన్యపుధరలు హెచ్చినకొలఁది బిరుదములవిలువ క్రమముగా దగ్గిపోవుచుండుట మిగుల విచారకరము. పూర్వకాలపు సత్సాంప్రదాయములు త్యజింపఁబడినవి. మంచిచెడ్డ విచారణ మడుగంటినది. తోచినట్లెల్లఁజేయుటయే ఘన కార్యముగ నెంచఁబడుచున్నది.

ఈ మధ్య శికింద్రాబాదులో కొందఱు ప్రోగై విశ్వప్రయత్న మొనర్చి, అయ్యల సోమయాజులగణపతిశాస్త్రిగారికి "మహాముని" యనుబిరుద మొసఁగియున్నారు. "మహాముని" కాదుగదా "మహా మహాముని" యని యిచ్చినను ఎవరికి నేలాటినష్టము కలుగఁబోదు కాని, లోకము పరిహసించు కార్యమునకు వీరు పాల్పడిరనిమాత్రము చెప్పకతప్పదు. కవి హృదయమును గవియే గ్రహింపఁగలుగునట్లు "మహాముని" యని మఱియొకరిని సన్మానించునప్పుడు, వారి శక్తి సామర్థ్యములం గ్రహించఁదగుపాటిమునులు కొందఱైన నుండవలెను గదా ? మునులే లేనప్పుడు మహామును లెక్కడనుండి వచ్చెదరు ? ఏకాలముననైన నిట్టి వింతలు పుట్టియుండెనా !

శ్రీ శాస్త్రిగారు మాత్రము తమ కీబిరుదము వలదువలదని నొక్కిచెప్పిరంట ! కాని వారి యనుచరులు ఈ బిరుదము నిచ్చుటకు మేము వేడుకపడితిమిగాన గ్రహించమని వారిని ప్రార్థించిరంట ! ఇంత బలవంతపు బ్రాహ్మణార్థమేల ? నిజముగాఁ దమ కీ బిరుదమక్కరయే లేనియెడల శాస్త్రిగారాసభకురానేల ? వచ్చిరిపో, ఒకరు బలవంత

ముఁ జేసినంతమాత్రమునఁ దమ మనోనిశ్చయమును మార్చుకొందురా ! ఇది ధీరలక్షణమగునా ! కాఁజాలదు. దీనింబట్టి వీరుచెప్పునది యొకటి, చేయునది మఱియొకటియని తేలుచున్నది.

ఈ సందర్భమున నొకటి చెప్పవలసి యున్నది. ఏమన ? నేను "హెచ్చరిక" యను శీర్షికక్రింద వ్రాసిన పద్యములంగూర్చి కొందఱు మహనీయులు తమకుఁ దోఁచినట్లెల్ల నా సభయందుఁ బ్రసంగించిరని వినుచున్నాఁడను. వారట్లు ప్రసంగించుటకుఁగల కారణము కసిఁబోక మసిఁబూసికొనుటయేగాని వేఱుగాదు. దురభిమానగ్రహావేశపూరితులైన వారిమాటల బాటించుటకుఁ బ్రాజ్ఞుఁడు సమ్మతింపఁడు. నేను పరోక్షమున నెవరినో నిందించితినని శ్రీరంగనీతులు చెప్పవచ్చిన మహనీయులకు నా పరోక్షమున ననుఁగూర్చి పలుక వారి నాలుక లెట్లాడెనోగదా ! వీరిట్లు ప్రసంగించుటకు సభాసదు లెట్లవకాశమిచ్చిరి ? ఈ పాటి సభాధర్మమును గుర్తెఱుంగని తెలివితేటలుగలవారి సమక్షమున మన శాస్త్రిగా రవలీలఁగా "మహాముని" బిరుదమును బడయఁగలిగిరి !

నాపద్యములు కేవలమొక వ్యక్తినింగూర్చి రచింపఁబడినవి కావు వాటిని నిష్పక్షపాతబుద్ధితోఁ జదువు బుద్ధిమంతులకది దోఁపకపోదు. అనేకశతాబ్దములనుండి బానిసత్వమునకుఁ లోఁబడి, పడరానిపాట్లు పడుచుఁ గ్రమక్రమమున దుర్బలత్వమొందుచున్న సంఘమున, నున్నవి చాలక లేని కల్లోలములం బెంచుటయం దుద్యుక్తులై, విరుద్ధధర్మబోధకులగువారు బయలుదేరుచున్నారనియు, వారిపాల నప్రమత్తులై యుండవలసినదనియు స్వధర్మమునం దభిమానముఁగల నా సోదరులను హెచ్చరించితిని. దానం దప్పేమికలదు ? ఇది యట్లుండనిండు. మన శాస్త్రిగారుమాత్రము తాము సద్ధర్మములను బోధజేసినందులకు లోకకంటకులమైతిమనియు, అగ్నిహోత్రాది కార్యములు విధ్యుక్తములని చెప్పినందున లోకకంటకులమైతిమనియు, గాయత్రినుపాసించుఁడని వచించినందున లోకకంటకులము గావలసివచ్చితిమనియు ధీరోదాత్తచిత్తులై బలికిరంట ! ఈ పాటిబోధ లిదివఱ కెవరొనర్చియుండిరి !

మన శాస్త్రిగారు, ప్రాచీనపద్ధతుల విడనాడి, యశాస్త్రీయమగు మార్గమవలంబించుటవలన వీరిబోధలవలనఁగలుగు ప్రయోజనమత్యల్పము. మీఁదుమిక్కిలి యనర్థమపారము. ప్రస్తుతమన్నిసంఘములకంటె బ్రాహ్మణసంఘము కాలవైపరీత్యముచేత నానాటికి విధ్యుక్తధర్మములకు దూరంబగుచున్నయది. బ్రాహ్మణసంఘము బాగుపడినగాని తక్కినజాతు లున్నతికిరాఁజాలవు. ద్విజులు స్వధర్మనిర్వాహణమునకుం గడంగునట్లుజేయుటకై తాము సత్యముగ బద్ధకంకణులగునెడల, మన శాస్త్రిగారు ప్రస్తుతము తా మవలంబించువిధానముం జాలించి, యచ్చటచ్చటఁ బ్రత్యేకముగఁ బండితులతోఁగూడిన బ్రాహ్మణసభల గావించి యందుఁ దమ వాదముల నిల్పుకొని, బ్రాహ్మణధర్మమును బునరుద్ధరణ మొనర్చుట విధాయకము. పూర్వకాలపు సంస్కర్త లిట్టులనే ప్రవర్తించియుండిరి. అట్లుగాక పొట్టకూటికొఱకేవో నాలుగింగ్లిషుముక్కలను నేర్చుకొనినవారినిఁ జేర్చికొని, కలగూరగంపలం బోలు సభలయందుఁ దా మన్నివేదముల సారాంశమును గ్రహించితిమనియుఁ దమ పలికిన పలుకులే వేదభాష్యములనియు నెవరికైన సందేహముండినఁ దీర్చుటకు సంసిద్ధులమై యున్నామనియుఁ జెప్పిన లాభ మేమి? బ్రాహ్మణులను ఇహీహీ యని హేళన మొనర్చిన వచ్చు ఫల మేమి? చెట్టులేనిచోట ఆముదపు వృక్షమే మహావృక్షమని నట్లుండును. గోల కొండప్రాంతములు గొడ్డుపోయిన మాత్రాన నీక నెచ్చటను బండితులు లేరా?

పల్నాటి భక్తసమాజ ప్రథమ సమావేశము:

స్వస్తిశ్రీ క్షయనామ సంవత్సర జ్యేష్ఠశు ౧౨ లు శ్రీపల్నాడు తాలూకాలో నెలకొల్పబడిన భక్తసమాజప్రథమసమావేశము అలుగుమల్లెపాడు అగ్రహారంలో ప్రారంభమై పూర్ణిమవరకువిజయప్రదముగా సమాప్తమయ్యెను. అందు మొదటిరోజు పురసంకీర్తనయును గావింపబడెను. పిమ్మట శ్రీరాధాకృష్ణస్వామి వారిని ప్రతిష్ఠించి తత్సమీపం

బున శ్రీ భువనగిరి వెంకటప్పయ్య శాస్త్రిగారిచే భాష్యకాలక్షేపణయు పిమ్మట నామపారాయణము అధ్యాత్మ తరంగ అష్టపది సంకీర్తనలచే సభ ముగింపబడెను. భోజనానంతరము శ్రీ లంక సుందరరామశాస్త్రి గారిచే భాగవత పురాణమున్ను సంధ్యావందనానంతరము శ్రీ వెంపటి శ్రీశైలముగారి సంగీతకాలక్షేపములతో ఆరోజు ముగిసెను. రెండవ రోజు శ్రీ భువనగిరి వెంకటప్పయ్య శాస్త్రిగారి భాష్యము అష్టపది తరంగ అధ్యాత్మగానము మధ్యాహ్నము లంక సుందరరామశాస్త్రి గారి పురాణము శ్రీ ములుకుట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారి ఉపన్యాసములతోను కార్యదర్శి హరికథతోను రెండవరోజు కార్యక్రమము ముగిసెను. మూడవరోజు నామపారాయణ అధ్యాత్మ అష్టపది తరంగ అధ్యాత్మ గానమున్ను శ్రీ ములుకుట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారి ఉపన్యాసమున్ను లంక సుందరరామశాస్త్రిగారి భాగవత పురాణమున్ను సాయాహ్నము అధ్యక్ష కార్యదర్శి ఉపన్యాసములు ప్రభాత సేవలు మొదలగు కార్యక్రమములచే యీ ప్రథమ సమావేశము జయప్రదముగా సమాప్తిని జెందెను.

ఓం శాంతి శ్శాంతిః.

యీ సమాజమును పిలిపించి ప్రయ ప్రయాసలకోర్చి తాను తరించి ప్రజల తరింపజేసిన శ్రీ బేతనభొట్ల లక్ష్మీనారాయణ గారికి పుత్ర పౌత్రాభివృద్ధియు దేహాంతంబున మోక్షంబును యీ సమాజ అధిదేవతయగు రాధాకృష్ణస్వామివారు ప్రసాదించుగాత.

జాబు.

బ్రహ్మశ్రీ అభినవసరస్వతి పత్రికాధిపతులగు జానపాటి పట్టాభిరామశాస్త్రిగారి సముఖమునకు గుంటూరుజిల్లా పొన్నూరు పోష్టు దండమూడి నివాసి మండ చిన వెంకయ్య నమస్కారపూర్వకముగా వ్రాయు మనవి:—

ఆర్యా! యిప్పటి పరిస్థితులనుబట్టి గాంధిమతాను యాయులు రాజకీయములో ఆయన మాట లంగీకరించకున్నను సాంఘికములో మన ధర్మసంస్థలలో పంచములను విచ్చలవిడిగా ప్రవేశింపజేయ నుంకించుచున్నారు. యిందుకు తార్కాణముగా కాశీలో దశాశ్వమేధఘట్టములో నూటయేబదిమంది పంచములు గంగాస్నానము జేసి శ్రీవిశ్వనాథస్వామి దేవాలయ ప్రవేశము జేయ నుద్యమించగా ప్రభుత్వమువారు 144 శెక్షన్ ప్రయోగించి అడ్డుపర్చుటయు దక్షిణాది మధురమీనాక్షీదేవిఆలయములో రామనాథన్ అను బ్రాహ్మణేతరుడు ప్రవేశించి అర్ధమంటపముకడ టెంకాయకొట్టి కర్పూరం వెలిగించగా అర్చకాదు లడ్డుదగులుటయు గతవత్సరం తిరుచానూరు (అలివేలు మంగాపుర) దేవాలయములో మాలదాసరి ప్రవేశించగా ప్రభుత్వమువారు యేబదిరూపాయీలు అపరాధము విధించగా ఆంధ్రపత్రికాధిపత్యాదులు చేదోడువాదోడై వానిచే నప్పీలుచేయించి అపరాధము తీసివేయించుటయు మొన్నమొన్ననె యొకదొరసానికి చీరెగట్టించి పండితనామధారుడగు మాలవ్యాగారు శ్రీవిశ్వనాథుని దేవాలయ ప్రవేశము జేయించగా నచటివారీమె యెవరని ప్రశ్నింప పండితుడామె హిందువని జవాబొసంగ ఆర్యసమాజమతానుసారము జాత్యంతర మతాంతరులకు శుద్ధిస్నానమిచ్చి హిందువులనుట అర్చకాదులు గ్రహించి అపవిత్రమైన దేవాలయము సంప్రోక్షణాదులచే పునఃపవిత్రము జేయుటయు పత్రికలలో చదివినమీకు విశేషించి వ్రాయనేల? ఇట్టివిపరీతకాలమున మిముబోటు లూరకుండక కొన్ని ఖండనవ్యాసములు వ్రాయుచున్నను ఉచితమగు ప్రచార మవసరమని బ్రహ్మశ్రీ వేమూరి నృశింహశాస్త్రిగారు వ్రాసిన "స్వరాజ్యవాస్తవోపాయ ద్విశతి" యను నుద్బోధ (హెచ్చరిక) రూపమగు పొత్తమును నే నచ్చువేయించి ప్రచారముచేయ నారంభించి మీకొకపొత్తము నంపుచున్నాడను. అయ్యది వీలయినచో మీపత్రికలో ప్రకటించుటగాని లేక మీ అభిప్రాయము ప్రకటించుటగాని చేయుచు యిందుతో మీకంపిన కొన్నివ్యాసములు వెంటనే మీపత్రికలో ప్రకటింపుడు. మా

ర్జాలకిశోరన్యాయముగా అంతయు భగవంతునిభారమేనని యూర కున్నచో యిదివరకు బ్రహ్మసమాజ ఆర్యసమాజ దివ్యజ్ఞానసమాజి కులు విధవావివాహ రజస్వలానంతరవివాహ జాత్యంతరవివాహ గర్భాధానవయోనిర్ణయాది దుష్టశాసనములుచేయించి మనసనాతన ధర్మహర్మ్యము గూలద్రోయ నుంకించుచుండగా నీఇంటిదొంగలలో గడిదొంగలగు గాంధిమతానుయాయులు "అస్పృశ్యతానివారణ" మను పేర సనాతనధర్మసౌధములనం దగు మన దేవాలయాదుల నప విత్ర మొనరించుటకు బద్ధకంకణులై కార్యాచరణమునకు గడంగిరి గాన మర్కటకిశోరన్యాయముగా పత్రికాధిపతులు ప్రకటనలమూల మునను ననుబోటులు ప్రచారముమూలమునను సనాతనధర్మహర్మ్య మును మనప్రత్యర్థులు పడద్రోయకుండ వారివారిశక్తికొలది కాపాడు టకు పాటుబడు కాల మాసన్నమైనదని మరిమరి ప్రార్థించుచున్నాను.

శ్రీమచ్ఛంకర భగవత్పాదులు.

శ్లో॥ శాస్త్రం శారీరమీమాంసా దేవస్తు పరమేశ్వరః
ఆచార్యశ్శంకరాచార్యస్సంతు మే జన్మజన్మని॥

ప్రపంచమున ఆస్తికోత్తములలో శ్రీశంకరాచార్యులవారితో పోల్చదగిన ఆచార్యుఁడు మఱొక్కఁడు లేడు. అతిశయులు లేరని వేరుగఁ జెప్పనక్కఱలేదు పాండిత్యమునందును సదాచరణమునందును, ప్రతిభ యందును శ్రీశంకరునితో పోల్చుటకు శంకరునే మరల చెప్పవలయును గాని గత్యంతరము లేదు. ఇట్టి యమానుషచర్యలఁజూచి వీరి నవతార పురుషులనుగా ఆస్తికోత్తములు తలంతురు.

వీరి చరితమును గుఱించి మాధవీయ శంకరవియమును, ఆనంద గిరికృత శంకరవిజయమును పఠించి మనము స్పష్టముగ తెలిసికొన వచ్చును కాని కాలనిర్ణయమునుగూర్చి మాత్రము స్పష్టముగ తెలిసి కొనుటకుగాని అనుమానముచేత సాధించుటకుగాని తగిన ప్రమాణము లేవియు ఆగ్రంథములవలన తెలియుటలేదు. చరిత్రకారులు తమ శక్తి

కొలఁది ప్రయత్నించి ఒకవిధముగ కాలనిర్ణయమును చేయ ప్రయత్నించిరిగాని వారును అతిసందేహాభిప్రాయిష్ఠమగునటుల తమయభిప్రాయము చూప గలిగిరిగాని నిశ్చయముగఁ జెప్పఁజాలరైరి. శ్రీమజ్జగద్గురుపీఠముల యందలి ప్రమాణముల ననుసరింతమా యనిన ప్రతిమఠమునందును భిన్నభిన్నముగ కాలనిర్ణయము మొదలగునవి వర్ణించియుండుటచేత మధ్యవర్తియై కాలనిర్ణయమునకు పూనుకొను నతనికి సంశయాత్మత గలుగుటయేగాని అంతకంటె ఫలమేమియు గనంబడదు. సుప్రసిద్ధులగు ఇట్టి మహాత్ముల విషయమునం దంతట ఇదేవిధంబుగనున్నది. కవిసార్వభౌముఁడగు కాళిదాసునికాలమును గూర్చియు నింతయేకదా. ఈ సంగతి యెట్లుండినను నిందు ప్రవేశించుట తగదు కాని అయినను ఈ కాలమున జీవితచరితము వ్రాయు సమయమున కాలనిర్ణయమును గూర్చి కొంత చర్చించుట ఆచారముగ నున్నదికదా. ఆ యాచారము ననుసరించియే స్వల్పముగ నిచట చర్చింపఁబడును. ప్రథమమున జైనగ్రంథములవలన తేలిన ఆచార్యులవారి సమయనిర్ణయమును తెలిపి పిదప విమర్శకులు భిన్నభిన్నముగ తెలిపిన సిద్ధాంతములను వ్రాసెదను

మహారాష్ట్రభాషయందు అర్వాచీనకోశమను నొక గ్రంథము గలదు. దానియందు దాగ్రంథకర్త జినవిజయమను జైనగ్రంథమునుండి ప్రమాణవచనముల గనంబఱుచుచు శంకరాచార్యులవారి కాలము నీక్రిందివిధముగ చర్చించి నిర్ణయించియున్నాఁడు.

    7   5   1   2
శ్లో॥ ఋషి, ర్బాణ, స్తథా భూమి, ర్మర్త్యాక్షౌ, వామమేళనాత్
ఏకత్వేన లభే దంక స్తామ్రాక్ష స్తద్వివత్సరః॥
విశ్వజిచ్చ పితా యస్య విఖ్యాతశ్చ చిదంబరే
తస్య భార్యాంబికా దేవీ అంబికా లోకశంకరం॥
ప్రసూతా సర్వలోకస్య తారణాయ జగద్గురుం
శంకరేణ నిశీథేన స్వకీయేన చ తేజసా॥
బ్రహ్మైవ తాప్రసితం సర్వం సూత్వాగారం స్వలీలయా
వామాశాయ ? న బధ్నస్య మాఘే కృష్ణే శుభేదినే॥

చతుర్దశ్యాం నిశీథేతు పుష్యవంతౌ తథాఘటే
స్థార్వాసరే ప్రాదురాసీ ద్వాదశ్యాచ్ఛంకరోమహాః
పశ్చాత్పంచద శేవర్షే శంకరస్యాగ తేసతి
భట్టాచార్యకుమారస్య దర్శనం కృతవాః శివః
ద్వావింశద్వర్ష విజ్ఞేయా స్థితి గాసీద్ధిమూంలయే
శంకరస్య శరీరస్యా వసానమభవత్తదా
9 8 1 2
నందో వసు ర్భూమి నేత్రే తే మేలనే శాక ఉత్తమః
జ్ఞాతవ్యః పాండుపుత్రస్య జాతోవా మేనవైతదా
దుర్ముఖేమార్గ శీర్షేచ శుక్లపక్షే త్రయోదశీ
సోమప్రదోషే సాయాహ్నే కైలాసం శంకరోగతః॥

ముఖ్యార్థము:- యుధిష్ఠిరశక సంవత్సరములు 2157 వెళ్ళినపిదప వచ్చిన రక్తాక్షీనామసంవత్సర మాఘకృష్ణ చతుర్దశీ సోమవారమున అర్ధరాత్రియందు శంకరాచార్యులవారు జన్మించిరి. జననకాల సమయమున సూర్యచంద్రులు కుంభరాశియందుండిరి. తరువాత యుధిష్ఠిర శకము 2190 లకు సరియగు దుర్ముఖ సంవత్సర మార్గశిర శుక్లపక్ష త్రయోదశీ సోమప్రదోషమున శంకరులు సిద్ధినిపొందిరి.

౨ అష్టా చత్వారివర్షాణి జన్మకాలాద్గతానివై
ప్రాదుర్భావ శ్శంకరస్య తతో జాతోఽతివాదినః॥

అర్థము:— కుమారిలభట్టు ౪౮ వత్సరముల వయసుగలవాఁడై యుండగా శంకరాచార్యులవారు జన్మించిరి.

7 8 8

3 శ్లో॥ ఋషి, ర్వసు, ర్వసుర్జ్ఞేయః పాండవానాం మహాత్మనాం
గణనా శేషకాలస్య శకస్య శివజన్మని॥

అర్థము:— యుధిష్ఠిర శకము కలియుగమున ౩౦౪౪ వరకని జ్యోతిష్కుల సిద్ధాంతము. అందు ౮౮౭ సంవత్సరములు మిగిలియుండగా (అనగా ౨౧౫౭ సంవత్సరమున) శ్రీశంకరాచార్యులవారి జనన మని తాత్పర్యము.

ఇది అర్వాచీనకోశకారుని అభిప్రాయము.

౨ సదానందస్వామి యను వారొక శంకరవిజయ గ్రంథము నొనర్చిరి. దానియందు ఆచార్యులవారి కాలనిర్ణయము నీక్రిందివిధమున నిచ్చి యున్నారు.

శ్లో॥ ధర్మోద్వావింశతిశకే సప్తాశద్విసహస్రకే
అబ్దే సర్వజితేజాతః సహావైపంచమీదినే॥
సుముహూర్తే శుభేలగ్నే హ్యుచ్చస్థగ్రహపంచకే
సాసతీ సుషువేబాలం శంకరాఖ్యం జగద్గురుం॥

అర్థము:— యుధిష్ఠిర శకము ౨౭౨౨ సంవత్సరములయిన పిదప సర్వజిత్సంవత్సర పుష్యమాస పంచమియందు శంకరాచార్యుల వారు జన్మించిరి.

(ఇంకయు కొన్నిప్రమాణము లున్నను గ్రంథవిస్తరభీతిచే వదలితిమి.)

ఇక ఆధునిక సిద్ధాంతము ననుసరించిన కాలక్రమము.

౧ ఆచార్యులవారు (౨-౧-౧-౮) సూత్రభాష్యమునందు “ నహిదేవదత్తః స్రుఘ్నే సన్నిధీయమాన స్తదహరేవ పాటలీపుత్రే సన్నిధీయతే * * * నహివంధ్యాపుత్రో రాజా బభూవ ప్రాక్పూర్ణవర్మణోఽభిషేకాదిత్యేవం * * * విశేష్యతే ” అని వ్రాసియున్నారు. దీనివలన ఆచార్యులవారి కాలమున స్రుఘ్న, పాటలీపుత్రములను నగరములున్నవనియు, శంకరాచార్యకాలమున పూర్ణవర్మ రాజ్యముచేయుచున్నట్లును సిద్ధించునని తలంచి పాటలీపుత్రము క్రి. శ. ౫౭౬ సంవత్సరమున ప్రవాహ వేగమువలన నశించుటచేత శంకరాచార్యులు క్రి. శ. ౭౮౮ సం॥ జన్మించిరని చెప్పెడి వారివచనము లప్రమాణములనియు, పూర్ణవర్మ క్రి. శ. ౬ వ శతాబ్దమున మగధ రాజ్యమును పాలించుటచేత శ్రీ శంకరాచార్యులవారును క్రి. శ. ౬ వ శతాబ్దాంత్య భాగమున జన్మించియుందురు. అని కాశీనాథత్ర్యంబక తెలాంగుగారి మతము.

౨ నేపాలదేశ ప్రభువగు వృషదేవరాజు కాలముననో తన్మరణానంతరమున కొంతకాలముననో శ్రీశంకరాచార్యులవారు నేపాలదేశమునకు బోయిరి. వారచటనుండగా నేపాల రాజునకు పుత్రోత్పత్తి కలిగెను.

ఆచార్యులవారియందు తనకుగలగౌరవమును తెలుపుటకై తనపుత్రునకు "శంకరదేవు" డని పేరు పెట్టెను. వృషదేవుని కాలము క్రీ. శ. ౬౩౦ మొదలు ౬౫౫ వరకు నిర్ణయించితిని. గావున శంకరాచార్యులు క్రీ. శ. ఏడవశతాబ్దాదిమ భాగమున నుండిరి, అని 'ఫ్లీటు' అను పూర్వాణపండితుడు ఇండియన్ ఆంటిక్వేరి వాల్యూం ౧౬ అక్టోబరు సంచికయందు వ్రాసియున్నాడు.

3 క్రీ. శ. ౭౮౮ సంవత్సరమున ఆచార్యులవారు జన్మించిరని కాశీనాధపాటల్ అనువారు ఇం. ఆ ౧౧ వాల్యూం జనవరి సంచికయందు చర్చించివ్రాసిరి. ఇదేఅభిప్రాయమును రామమోహనరాయలు వీబరు మ్యాక్సుముల్లరు డబ్ల్యూ లోగన్ విల్సన్ మెక్డానల్ మొదలగు పండితులు అంగీకరించి వ్రాసియున్నారు. కాని యెవరి ఊహలు వారికి ప్రమాణములుగ తోచుచున్నవేగాని నిశ్చయముగ ఒకరిమతమును సాధించుటకును ఒకరిమతమును దూషించుటకును తగిన ప్రమాణము లేవియు గనంబడుటలేదు.

ఆచార్యులవారి చరితము.

శ్రీశంకరాచార్యులవారు కేరళదేశమునందు పూర్ణానదీతీరమున (దీనికిప్పుడు ఆల్వాయినదియని ప్రసిద్ధి) ఆల్వాయియను నొకగ్రామము గలదు. ఇది ఇపుడు సౌతుఇండియన్ రైల్వేమార్గమున నొకస్టేషను. దీనికి 2 కోసులదూరమున నదికి ఉత్తరమున కాలటియను నొక చిన్న బ్రాహ్మణ అగ్రహారముగలదు. ఆ యగ్రహారమున శ్రీశంకరాచార్యులవారు జన్మించిరి. ఆచార్యులవారి తండ్రి శివగురువు. పితామహుడు విద్యాధిరాజు. తల్లి ఆర్యాంబ. శ్రీ ఆచార్యులవారికి సోదరులుగాని అక్కచెల్లెండ్లుగాని పినతండ్రి పెదతండ్రులుగాని లేరు. ఆచార్యులవారు స్ఫురద్రూపులగుటచేత లేక లేక కన్నకొడుకని తల్లితండ్రులకేగాక ఇరుగుపొరుగు వారందఱికిని సంతోషమును కలుగజేయుచుండిరి. ఆచార్యులవారు బాలుఁడై యుండగనే ఉపనయనము కాకముందే తండ్రి గతించెను. ఐదవయేట ఆచార్యులవారికి ఉపనయన మహోత్సవము తల్లిచేతజరుపఁబడెను. బ్రహ్మచర్యాది నియమములతో గురుసమీపమున

వేదములను షడంగములను స్వల్పకాలములో పఠించి మరల తల్లి దగ్గిరకువచ్చి శుశ్రూష చేయుచుండిరి. ఆచార్యులవారి తల్లి కుమారునకు వివాహము చేసి కోడుకును కోడలినిచూచి సంతసింపవలయునని ప్రయత్నములు చేయఁదలచెను. ఆచార్యులవారికి సన్యసించి మతోద్ధారము చేయవలయునను తలంపు కలిగెను. మాతృదేవి అనుజ్ఞ లేనిది ఆశ్రమము స్వీకరించుట తగదని తలంచి సమయము నిరీక్షించుచుండిరి. ఒకనాడాచార్యులవారు తల్లితోడ తటాకమునకుబోయి తల్లి తీరమునకుండగా తానుస్నానముచేసి జపముచేయుచుండగా ఒక మొసలి ఆచార్యులవారి కాలిని పట్టుకొనెను. ఆచార్యులవారంతట ఉలికిపడి తప్పించుకొన శక్తి లేక తల్లీ! మొసలినా కాలినిబట్టి లాగుచున్నది. ప్రాణములు పోవుచున్నవి. నాప్రాణమునందు ఆశయున్నయెడల సన్యాసమునకు అనుజ్ఞనిమ్ము, ప్రాణముతో భూమిమీఁద తిరిగెదను" అని చెప్పగా బ్రతికినచాలునని పుత్రునకు అనుజ్ఞ నిచ్చెను. వెంటనే మొసలి కాలిని వదలిపెట్టెను. ఆచార్యులవారా తటాకమునుండి వెలుపలికివచ్చి పిత్రీయధనమును తల్లిని దాయాదులకు ఒప్పచెప్పి నీవు ఎప్పుడు తలచిన అప్పుడు సమీపమునకు సిద్ధముగ వచ్చెదనని చెప్పి తల్లిని సమాధానపరచి తురీయాశ్రమమును యథాశాస్త్రముగ గోవిందభగవత్పాదాచార్యులవారిదగ్గిర స్వీకరించిరి తరువాత గురువులవారి యాజ్ఞానుసారము కాశికి వెళ్లిరి. మార్గమున పలువురు ఆచార్యవారికి శిష్యులయిరి. ఆచార్యులవారు ౧౨ వ సంవత్సరమున దశోపనిషద్భాష్యమును రచించిరి. తరువాత ప్రభాకరాది పండితోత్తముల జయించి అద్వైతమతమును బోధించు శారీరకభాష్యమును నిర్మించిరి. శంకరాచార్యులవారు తా మొనర్చిన భాష్యమును శిష్యులకు బోధించుచుండగా ఒకవృద్ధబ్రాహ్మణుఁడువచ్చి "ఎవరోయి ఇచట భాష్యకారుడు" అని శిష్యులను నతితిరస్కారముగ నడుగగా వారు ఆచార్యుని చూపించిరి. తరువాత ఆచార్యులవారి సమీపమునకు వచ్చి "నీవు భాష్యకారుడవయినయెడల, తదంతరప్రతిపత్తౌరంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యాం - ౩ - ౧ - ౧. అను సూత్రమును చెప్పుము" అనినిర్లక్ష్యముగ నడిగెను. అచార్యులవారందులకు "నేను భాష్యకారుడనని గర్వపడుటలేదు. తోఁచినది చెప్పుచున్నాను అని సూత్రార్థమును

చెప్పగా బ్రాహ్మణరూపియగు వ్యాసుఁడు వితండ వాదముచేసి కుతర్కములచేత ఖండించిరి. ఆచార్యులవారు మరల ఖండించిరి. ఇటుల జయాపజయములులేక ౮ దినములు వాదము అతి విజృంభణముగ జరిగెను. సమీపమునందున్న పద్మపాదులవారా బ్రాహ్మణుని వ్యాసునిగా నెఱింగి "నారాయణస్వరూపియగు వ్యాసులవారును శంకరావతారులగు తమరును వాదము చేయుచుండగా మాబోటివారు చేయునదేమున్నది" అని చెప్పగా ఆచార్యులవారు ఆశ్చర్యపడి వ్యాసులవారిని స్తుతించగా, వ్యాసులవారు నిజరూపముతో దర్శనమిచ్చిరి. తరువాత ఆచార్యులవారు నాకు ౧౬ సంవత్సరముల వయస్సేగాని అధికములేదు. సమాప్తిఅయినది తమరుసమీపమున నుండుడు, సమాధిచేత దేహమువిడిచెద నని చెప్పగా దిగ్విజయముచేసి మతప్రచారము చేయుమని చెప్పి మరల ౧౬ సంవత్సరముల ఆయుస్సునిచ్చిరి. తరువాత కర్మమార్గ ప్రవర్తకులగు భట్టపాదులవారిని జయించుటకు ప్రయాగకు వచ్చిరికాని నాశిష్యుఁడగు మండనమిశ్రుని జయించిన మేలని వారు చెప్పగా అదేప్రకారము మండనమిశ్రుని జయించి సన్యాసాశ్రమము ఇప్పించ దలచగా అతని భార్య నన్నుజయించి నాభర్తకాశ్రమమిప్పించుడని చెప్పగా ఆమెనుజయించి మండనమిశ్రున కాశ్రమమిప్పించి అతనిచేత భాష్యవార్తికము చేయించిరి. తరువాత గోకర్ణాది క్షేత్రముల దర్శించి శృంగగిర్యాది మఠముల స్థాపించిరి. తరువాత తల్లికిమరణకాలమాసన్నమాయెనని యోగశక్తిచేత నెఱింగి తల్లిసమీపమునకు జనిరి. తల్లి కుమారునిగని దేహధారణమున తనకు ఇష్టములేదన శంకరులు బ్రహ్మోపదేశముచేయ వైకుంఠమునకు బోయెను. శంకరులు తల్లికి పరలోకక్రియలుచేసి దిగ్విజయముచేసి కాశ్మీరదేశమున సర్వజ్ఞపీఠాధిరోహణముచేసి నాలుగుదిక్కులయందు (తూర్పున జగన్నాథమున దక్షిణమున శృంగేరియందు పశ్చిమమున ద్వారకయందు ఉత్తరమున బదరికాశ్రమమున) మఠముల స్థాపించి శిష్యుల నియమించి బదరికాశ్రమమునకుబోయి కైలాసప్రాప్తినందిరి.

~ శంకరాచార్యులొనర్చిన గ్రంథములు. ~

వ్యాఖ్యానగ్రంథములు ౯ లేక ౧౮	భగవద్గీతాభాష్యము
బ్రహ్మసూత్రభాష్యము	కేనోపనిషద్భాష్యము
(దీనికేశారీరక భాష్యమనిపేరు)	శ్వేతాశ్వతరోపనిషద్భాష్యము
దశోపనిషద్భాష్యము	నృసింహతాపిన్యుపనిషద్భాష్యము

సనత్సుజాతీయ భాష్యము
(ఇది భారతములోనిది)
గాయత్రీభాష్యము
విష్ణుసహస్రనామ భాష్యము

మూలగ్రంథములు. ౨౦

సౌందర్యలహరి
ఉపదేశసాహస్రి
అపరోక్షానుభూతి
శతశ్లోకి (వేదాంత కేసరి)
స్వాత్మనిరూపణము
వివేకచూడామణి
అద్వైతకౌస్తుభము
అద్వైతానుభూతి
హరిమీడేస్తవము
ప్రబోధసుధాకరము
ఆత్మబోధ
పంచీకరణము
వేదాన్తసారము
వేదాంతముక్తావళి
తత్త్వానుసంధానము
వాక్యవృత్తిదర్పణము
మహావాక్యవృత్తిదర్పణము
మహావాక్యవివేకము
మహావాక్యవివరణము
ప్రశ్నోత్తరరత్నమాల
దక్షిణామూర్తిస్తోత్రము

స్వల్పగ్రంథములు. ౨౩

ఆత్మషట్కము (౬ శ్లోకములు
విజ్ఞాననౌక ౬ ,,
మనీషాపంచకము ౫ ,,
సాధనపంచకము ,, ,,
కౌపీనపంచకము ,, ,,
కాశీపంచకము ,, ,,
వైరాగ్యపంచకము ,, ,,
రత్నపంచకము ,, ,,
ఆత్మపంచకము ,, ,,
నిర్వాణషట్కము ౬ ,,
నిర్వాణదశకము ౧౦ ,,
సప్తశ్లోకగీతా ౭ ,,
చర్పటపంజరీ ౧౪ ,,
ద్వాదశపంజరికా ౧౨ ,,
హరినామమాల
షట్పది ౬ ,,
ఆత్మచింతనము ౨౭ ,,
లఘువాక్యవృత్తి ౧౮ ,,
వివేకాదర్శము
బాలబోధిని
ఆనందలహరి
నీలకంఠశైవసంవాదము

మొదలగునవి.

స్తోత్రములు మొదలగునవి. ౪

గంగాధరాష్టకస్తోత్రము
శివమానసపూజ
విష్ణుమానసపూజ
భవానీమానసపూజ
జీవబ్రహ్మైక్యస్తోత్రము
భగవన్మానసపూజ
బ్రహ్మనామావళిస్తోత్రము
కాళికాస్తోత్రము
శివభుజంగప్రయాతస్తోత్రము

శివపంచాక్షరస్తోత్రము
శివాపరాధక్షమాపణస్తోత్రము
చంద్రమౌళీశ్వరస్తోత్రము
లక్ష్మీనృసింహస్తోత్రము
నారాయణస్తోత్రము
త్రిపురసుందరీస్తోత్రము
అన్నపూర్ణాస్తోత్రము
విష్ణుపాదాదికేశాంతవర్ణనస్తోత్రము
దత్తాత్రేయసహస్రనామస్తోత్రము
శివసర్వోత్తమస్తోత్రము
దశావతారస్తోత్రము
లలితాస్తవరాజము
త్రివేణీస్తవము
శారదాస్తుతి
విఠలస్తోత్రము
రామలక్ష్మణస్తోత్రము
వేదాంతసారశివస్తోత్రము
అపరాధభంజనస్తోత్రము
కృష్ణతాండవస్తోత్రము
దేవ్యపరాధక్షమాపణస్తోత్రము

అష్టకములు.

అంబాష్టకము
పాండురంగాష్టకము
శివనామావల్యష్టకము
కాలభైరవాష్టకము
అచ్యుతాష్టకము ౨
కృష్ణాష్టకము
జగన్నాథాష్టకము
యమునాష్టకము ౨
ధన్యాష్టకము
శివరామాష్టకము
గంగాష్టకము
మణికర్ణికాష్టకము
గోవిందాష్టకము
భైరవాష్టకము
కామాక్ష్యష్టకము

ఇతరగ్రంథములు.

రాజయోగము
యోగతారావళి
అమరుశతకము
వజ్రసూచికోపనిషత్తు
శివానందలహరి

మొదలగునవి గ్రంథములు.

అష్టకములన్నియు శంకరాచార్య విరచితములని గనంబడుచున్నవి కాని శైలి మొదలగునవిచూడ కొన్నిటియందు సందేహము కలుగుచున్నది. శ్రీ శంకరాచార్య పీఠము నధిష్ఠించిన వారికందరికి శ్రీ శంకరాచార్య బిరుదముండుటచేత ఇటీవల శంకరపీఠము నధిష్ఠించినవారు చేసియుండవచ్చును. కాని దీనిని వీరొనర్చిరి దీనిని చేయలేదు అని చెప్పుట మాత్రము అశక్యము,

అటుల దొరకియున్నంతవరకు గ్రంథముల నామములిచట నిచ్చియున్నాము. ఇతరములగు గ్రంథములు కొన్ని యుండవచ్చును. కొన్ని అది శంకరాచార్య కృతములు కాకపోవచ్చును. ఈ సూచి మాత్రము పైగ్రంథములన్నియు ఆమూలముగ చదివి విమర్శించి వ్రాసినదిమాత్రము గాదు.

— సహస్ర స్తంభముల మంటపము – హనుమకొండ —

హనుమకొండ పట్టణము ఆంధ్రరాజ్యలక్ష్మీ వైభవమునకు మూల స్థానమైయుండుటచే, నాంధ్రుల పురోభివృద్ధియందించుకేని యాసక్తిగల ప్రతిమానవునియొక్క హృదయమును ఆకర్షింపకమానదు. చారిత్రాంశములఁ దెలుపు విశేషసాధనము లీపట్టణమునందు లేకయున్ననుఁ కాలగతిచే వికృతమై శిథిలమై జీర్ణావస్థయందు నిలిచియుండిన యొకటి రెండు జ్ఞాపకచిహ్నములైనను, ప్రేక్షకుల వ్యసనోద్గారమునకు మాత్రము వలయునంతకన్నను విశేషమైయున్నవని చెప్పవచ్చును. ఈశిథిలములందు సహస్రస్తంభమంటపము ముఖ్యమైనదిగా నున్నది. రుద్రదేవ రాజు పితృవధకై పరితపించుచు పుణ్యక్షేత్రముల దర్శించినపిదప విజయ యాత్రసలిపి తన రాజ్యమునకు మరలివచ్చు సమయమున అనేక దేవాలయముల స్థాపించుచు వచ్చెను. ఆకాలముననే ఈదేవాలయమును నిర్మించెను. తన నివాసస్థానము ఓరుగల్లు పట్టణమయ్యున్నను, రాజధానికి నాలుగుమైళ్ళదూరమున నుండు నీపట్టణము తనతాత ముత్తాతలకు ముఖ్యపట్టణమై యుండుటచే అతిప్రేమచే నిక్కడ నొకగొప్ప దేవాలయము నిర్మించెను. అందు వాసుదేవరను, సూర్యదేవరను, ఉమామహేశ్వరను ప్రతిష్ఠచేయించెను. ఈయన మతమున వీరశైవుడయ్యును శివునితోపాటు విష్ణువును ప్రతిష్ఠించుటయేగాక అగ్రస్థాన మొసంగెను. రాజులు జాతిమతభేదములను పాటించుట యనర్థదాయకంబను ముఖ్యసూత్రమును గ్రహించి సర్వమతాదర్శములను సమానముగా గౌరవించి యిట్లు చేసెను.

ఈదేవాలయగర్భమున ఉత్తరముఖులమై ప్రవేశింతుము. ఎదుట వాసుదేవరయు, కుడివైపున సూర్యదేవరయు, ఎడమవైపున రుద్రేశ్వరుడును కలరు. ఇప్పుడుమాత్రము ఎడమవైపుననుండు గుడియందు లింగముతప్ప తక్కిన రెండు ఆలయములలోనుండు శిలాపీఠములపైన ఎట్టివిగ్రహములును లేవు. ఈవిగ్రహములను కొంతకాలమైన పిమ్మట అసూయాపరవశులగు మానవులు గొందరు బగులగొట్టియుండవచ్చును. వాసుదేవర గర్భాలయద్వారముపై శంఖచక్రగదాధారియగు నరసింహ

విగ్రహమును, సూర్యాలయద్వారముపై గజారూఢయైన లక్ష్మీవిగ్రహమును, శివాలయద్వారముపై త్రిశూలధారియగు రుద్రునివిగ్రహమును చెక్కబడియున్నవి. ఈమూడుద్వారములయందుగల విగ్రహములకునుగూడ రెండుపార్శ్వములయందు, సర్వాలంకారభూషితములయి తలలువైకెత్తి నోరులు తెఱచుకొని నిలువబడియుండు వరాహవిగ్రహములు వెలయుచున్నవి. వానినోటినుండి చిత్రవిచిత్రఫల పుష్పసమన్విత లతాపుంజము బయలువెడలి, అతిమనోహరముగ నానాముఖముల యల్లిబిల్లికలతో పైకెగబ్రాకి, తమమధ్యనుండు విగ్రహము చుట్టు వ్యాపించియుండును, ఈసుందర శోభాయమానమైన లతాకుంజములు దర్శనీయములుగనున్నవి. పత్రములయొక్క కాండములు ఉపకాండములు చక్కగాఁ గనుపించునట్లు చిత్రింపఁబడియున్నవి. పుష్పముల రెక్కలు ప్రకృతినిర్మిత పుష్పములభాతి విడివిడియై తొడిమెలు మాత్రము లతలకు నంటియున్నవి. ద్వారబంధములకు క్రిందభాగమునందు చిత్రవిచిత్ర యలంకారములుగల సుందరస్త్రీపురుష విగ్రహములు నిర్మింపబడియున్నవి. ద్వారములకు రెండుపార్శ్వములయందు ద్రాక్షలతయును, ముత్యముల గెరటలును,గంటలవరుసయు, ఒక దానిపై లత నొకటి నిలువబడియుండు సింహములపంక్తియును, చిన్నచిన్న ప్రతిమలయొక్క వరుసలును నిలువున బహురమ్యముగా ఒకదానితరువాత నొకటి చెక్కబడియున్నవి. ఈవరుసలమధ్య శిల్పకళానైపుణ్యము సంపూర్ణముగా జూపఁబడిన రెండుస్తంభములును, వాని నిరుగడల పూలదండలు వ్రేలాడఁగట్టినట్లుగా నిర్మింపఁబడినవి. మధ్యమంటపములకును, గర్భాలయమందలి స్తంభములకును మధ్యనుండు స్థలమంతయు ఒక్కవ్రేలైన నిడుటకు స్థలములేనటుల అతిరమ్యముగా చిత్రములు చెక్కఁబడినవి. ఈ స్తంభములలో నొకదానియందు తలక్రిందుగానుండు మనుష్యప్రతిమయు ఒకచేపయు చిత్రింపఁబడియున్నవి. ఇయ్యవి దృష్టిదోషపరిహారమునకు గాబోలునని జనులూహించెదరు. ఈ మంటపముయొక్క యరుగుల క్రిందిభాగమున నొకవైపు ఆంజనేయవిగ్రహమును, వృశ్చికమును దనపాదముక్రింద నదిమిపట్టిన సింహమును చిత్రింపఁబడియున్నవి.

ఈదేవాలయమున కెదురుగా ఒకనందివిగ్రహము 7½ అడుగులు పొడువును, 4½ అడుగులు ఎత్తును చుట్టు కొలతలో మూడువైపులు మాత్రము 9½ అడుగులు గలిగి,జూలు, డెక్కలు, మూతిపై నరములు నాసికారంధ్రములు మొదలుగాగలఅంగములన్నియు స్ఫుటముగా నిర్మింపబడియున్నవి; ఈనందికి పట్టుకుచ్చులతో కట్టబడిన రుద్రాక్షల దండయును, గంటలయొక్కయు, శంఖములయొక్కయు, హారములును, మెడలో వేయబడియున్నవి. ఈహారములన్నిటికి, పట్టుత్రాళ్ళతో మెడపైన కట్టినట్లు బహుస్పష్టముగా వేసియుండు ముడులు కనుపించుచుండును. ఈశిల్పకళా చాతుర్యము ఎట్టివానినైనను విస్మయము నొందింపక మానదు. ఈదేవాలయము ౭౫౦ సంవత్సములు గడచినను సానబట్టిన శిలాప్రతిమలును, స్తంభములు మున్నగునవి నేటికినిఅద్దములవలె ప్రకాశించుచున్నవి.

ఈయాలయమున చారిత్రాంశముల దెలుపు మూడుశాసనములు కనుగొననగును. గర్భాలయ మంటపమునందలి స్తంభమునకు "శ్రీయోరుగంటి తిమ్మాచ రాజుపరిజనశ్రీగిరిశృంగవాసి పండితారాధ్య కృపాశ్య" అని వ్రాయబడి యున్నది. ఈమాచరాజు యెవ్వడో తెలిసికొనుటకు ఆధారములు గానరాకున్నవి. గోసగి ఈశ్వరదేవుడు కాకతీయ రాజుల రాజ్యాభివృద్ధికిగాను చతుర్ముఖ దేవరను ఉమామహేశ్వరను, ఆదివరాహ దేవరను, వేయి లింగములను ప్రతిష్ఠచేయించి కొంత భూదానముఁ చేసినట్లు దేవాలయములోని గోడయందు వ్రాయఁబడియున్నది. కాలము తెలిసికొనుటకు సాధనము లేవియుఁ గానరాకున్నవి. అక్షరములనుఁబట్టి యూహించిన ౭౦౦ సంవత్సరములకు ముందు వ్రాయఁబడినట్లు దెలియుచున్నది. ఈ యాలయముపేరు ఆకాలమున రుద్రేశ్వరమని వ్యవహరింపఁ బడుచున్నటు లీశాసనమును బట్టి తేలుచున్నది. ద్వారముకడ నిలుపఁబడిన శాసనము రుద్రదేవునిచే స్థాపించబడినది. దీనిలో త్రిభువనమల్లుని కాలమునుండి ఇటీవల వారినామములు దెలుపఁబడియున్నవి. వడ్డెపల్లి చెఱువుయొద్ద శిథిలమైపడియుండు శాసనములలో త్రిభువనమల్లునితండ్రి ప్రోలరాజుయని వ్రాయబడి యున్నది. కాబట్టి త్రిభువనమల్లునితండ్రి మొదటి ప్రోలరాజు, రుద్రదేవుని తండ్రి

రెండవ ప్రోలరాజు అని నిశ్చయింపవచ్చును. రెండవప్రోలరాజు పరాక్రమమును యాతడు జయించిన రాజుల నామములనుం దెలిసినపిదప రుద్రదేవుడు జయించిన రాజుల నామములుం దెలుపంబడి యున్నవి. ఈ శాసనములో...

శ్లో॥ "ఈడే మేడవిడంబడంబరభరే క్షేదక్షమంత్ర్యాభృతాం
దుర్వారోద్ధుర వీరమంత్రసమయారాధ్యైక దీక్షాగురుః
శ్రీమన్నైల్గిగి దేవసంగసమయే ప్రోద్భూత దర్పాపహం
ప్రాప్త శ్రీపోలవాస దేశవిభవం శ్రీరుద్రదేవం సదా ॥

అని రుద్రదేవరాజునుంగూర్చి వ్రాయంబడియున్నది. ఈశ్లోకమునందు బేర్కొనంబడిన మేడరాజు నైజామ్ రాష్ట్రములో పాఖాల్ తాలూకాకుచేరిన కురువపట్ట మొదలుకొని గోదావరీతీరము వరకుం గల ప్రదేశమును పాలించుచుండినటుల కొన్ని శాసనములవలన దెలియుచున్నది. ఇతని మంత్రియైన నాగదేవరాజు పార్శ్వజినేశ్వర దేవాలయము నిర్మించి కొంతభూదానముం జేసినట్లు పాఖాలతాలూకాలోని గోవిందాపుర గ్రామముయొక్క పెద్దచెఱువులో ఒకశాసనముపైన వ్రాయబడియున్నది దీనిలో మాధవవర్మవంశమున దుర్గరాజు జన్మించెనని వ్రాయబడియున్నది. ఇతనికి మేడరాజు జగ్గరాజను నిరువురు పుత్రులుండిరని తేలుచున్నది. వీరు మతమున జయినులయిన ట్లీ క్రింది శ్లోకము శాసనమునకు మొదట వ్రాయంబడినది.

శ్లో॥ "శ్రీమన్నతేంద్ర ముకులోజ్వల రత్నభూషా
నాంగేంద్రహస్త సరసీరుహాకర్ణపూరా
విద్యాధరేంద్ర రచితోత్తమ కుంకుమా (హి) వీ
భూయాచ్ఛ్రాయజినదేవ పదాంబుజశ్రీః.

ఈమేడరాజు మంత్రియైన నాగదేవరాజుచే నీశాసనము స్థాపింపంబడియుండుటంబట్టి విశేషించి తన్నుగూర్చి యెక్కువగాం దెలుపుకొనియున్నాడు. మేడదేవరాజు కాకతీయులకు లోంబడియున్నట్లీ శాసనమందెక్కడను దెలిపియుండలేదు. ఈశాసనము శా. శ ౧౦౮౯.

అనగా క్రీ. శ. ౧౧౨౨ ప్లవసంవత్సర ఫాల్గుణమాస శు॥ 3 దినమున లిఖియింపఁబడినది. హనుమకొండ శాసనమునకు 3౯ సంవత్సరముల క్రింద నీగోవిందాపుర శాసనము వ్రాయఁబడినది; ఈకాలమునకు రుద్రదేవరాజు రాజ్యమునకు వచ్చియుండఁడు. కాఁబట్టి ఈశాసనము ప్రోలరాజు కాలమున వేయించఁబడిన ట్లూహింపవలసియున్నది. ఈ శాసనమునకన్నను 2 సంవత్సరములకుముందు మానుకోట తాలూకాలోని మాటేడు గ్రామమున ప్రోలరాజుయొక్క సామంతుడు వేమచోల బొడ్డమమల్ల నాయకుఁడు అమరేశ్వరదేవాలయము నిర్మించి భూదానము లనేకములుఁజేసి శాసనమును వేయించియున్నాడు. ఈ శాసనము శా. శ. ౧౦౪౨ న వ్రాయించఁబడినది. కాఁబట్టి ఇంచుమించుగా మేడరాజుమంత్రియొక్క శాసనముసహా ప్రోలరాజు కాలములోనిదే యని నమ్మవలసియున్నది. ఇట్లు ఊహించుటకు ఇంక నెన్నియో సాధనములుఁగలవు.

ఇదే విధమున కరీమునగరము జిల్లాయందలి జగ్త్యాల్ తాలూకా ప్రాంతమున మైళిగిదేవుఁడు పొలవాసరాజ్యము నేలుచుండెను. ఈ రాజ్యము పేర యిప్పటికిని పోలాసయను గ్రామమొకటి ఆప్రాంతమునను న్నది. ఆగ్రామమున పోలస్త్యేశ్వర దేవాలయ మొకటియున్నది. మైళిగిదేవుని శాసనములీప్రాంతమున కొన్ని కన్పట్టుచున్నవి. రుద్రదేవ రాజులచే జయింపఁబడిన రాజులయొక్క రాజ్యములు వంశములు దెలుపు శాసనములను ఒకటితరువాత మఱియొకటి పరిశీలింపవలసి యున్నది. ఇప్పుడు మనము పరిశీలింపవలసిన దోమానాయకుఁడు గుండరాజు ఈ ప్రాంతము వారై యున్నారు.

ఈ హనుమకొండ దేవాలయముయొక్క ధూపదీపనైవేద్యములకుగాను మద్దిచెఱువు లనెడి గ్రామము దానముఁ జేసినటులీ శాసనమున వ్రాయఁబడియున్నది. ఈగ్రామమిప్పుడు పర్కాల తాలూకాలోఁ జేరియుండు ప్రదేశమందున్నది.

దేశభాషలతోపాటు ఆంగ్లముయొక్క స్థానము.

జ్ఞానము సర్వజంతుసామాన్యమైనను నరులయందు నానాటి కభివృద్ధిచెందునదియు సఫలంబగునదియు నగుచున్నది. పశుపక్ష్యాదులు జ్ఞానవంతములయినను మనుజులవలె దుస్సాధ్యంబగుకార్యంబుల సాధించుటలేదు. తమజాతి నుద్ధరించుకొనుటను లేదు. దీనికి ముఖ్యకారణము విద్యాశూన్యత్వముతప్ప వేరొండులేదు. ఈవిద్యయే పుస్తకములందును, ముఖములందును నుండును. ఉండి గ్రంథకర్తలకును వక్తలకును నక్షయంబగు యశస్సునొసంగుచున్నది. గ్రంథస్థ కంఠస్థ విద్యనే వాఙ్మయంబని యార్యులు వ్యవహరించుచుండిరి. మన యాంధ్రవాఙ్మయమెట్టిదో సంస్కృతాంగ్ల మహారాష్ట్రాదులును నట్టివియే. కాని ఇందు కొన్ని గ్రంథస్థమయినను సంస్కృతభాషవలె జనసామాన్యమునకు వ్యవహరించుట కనుపయుక్తమయినవియు మరికొన్ని గ్రంథస్థములు కానివియు నైయున్నవి. ఇది గ్రాంధికమని గ్రామ్యమని రెండువిధములుగనుండి కొన్నిభాషలయందు కవిత్వసౌకర్యంబును నచ్చటచ్చట రెంటిని కూర్చుటచే రత్నప్రోతంబగు నంగుళీయకంబువలెను వత్సరత్రయవయస్కుండగు శిశువుయొక్క భాషణంబువలెను నతిమధురముగను శ్రావ్యముగ నుండును. దేశభాషలందు తెలుగులెస్సయని మనపూర్వకవులచే ఖ్యాతిచెందిన మనయాంధ్రవాఙ్మయమే ఇప్పటికిని దేశభాషలందు నగ్రగణ్యత వహించుచున్నది.

మన భారతదేశమునందు తత్తత్ప్రాంతానుసారముగ నెన్నియో భాషలు భాషింపఁబడుచున్నయవి. దేశభాషల నభ్యసించు నాయా ప్రాంతములవా రీభారతవర్షమందలి జనులలో నత్యల్పసంఖ్యాకులు. జనులందరకును సామాన్యమగు భాష యేదియోయొకటి లేనిచో నభిప్రాయైక్యమును వర్తకవ్యాపారములును యాత్రలు మొదలగునవి జరుగుట కడుదుర్లభము. ఇందువలననే గృహమం దభిప్రాయైక్యావశ్యకత. భాషాబాహుళ్యమునుగూర్చి యొక చిన్నకథనుగూడ చెప్పుచుందురు. "తొల్లి కాశికాపురమందొక సువిస్తరమగునట్టియు

యాత్రికజన కల్పతరువగునట్టియు నొకధర్మశాల పంచపర్వసమేతంబై స్వప్రాకారసుధాధవళిమచే విశ్వేశ్వరుడు పాండురవర్ణుడాయెనా లేక ఇంత యత్యున్నతంబగు ప్రాసాదశ్రేష్టంబు వదలి కుత్సితకుంజరసదృశంబగు నాలయంబున వాసముచేయుచుంటి నెంతమందభాగ్యుడనని తెల్లవారెనాయని యనుదినాగతయాత్రికులకు శంకోత్పాదనకారణంబగుచు విరాజిల్లుచుండె.

అసంఖ్యగర్భగృహసమేతంబగు నాప్రాసాదవరమ్మునం దెందరో తత్తత్ప్రాంతభాషాభాషికులగు యాత్రికులు వాసముచేయుచుండిరి. ఆ సౌధవాసులకు దుర్దినంబగునట్టియు భాషాబాహుళ్యవాదులగు నితర జనులకు హితోపదేశదినంబుననగు నొకానొకదివసంబునం దా ప్రాసాద వరమ్మునందు చోరులు ప్రవేశించిరి. సౌధస్థులెల్లరు కొందరు దొంగలనియు మరికొందరు చోరులనియు నిటులనే యనేకభాష లందాక్రందించిరి. కాని యొకరిభాష మొక రెరుగరయ్యె. చోరులకు ధనసంచయ సంపాదన ఇంతసులభంబని వచింపనేల. అందరకొల్లగొట్టి ధనసంచయంబులెల్ల నిడికొనిపోయిరి.

దేశమునకంతయు సామాన్యభాష లేక ప్రత్యేక, భాషల వ్యవహరించిన ప్రత్యేకరాజ్యము లేర్పడవలసియుండును. ప్రత్యేకరాజ్య నిర్మాణమైనచో వివిధభాషాభాషికులగు సత్రనివాసుల ధనసంచయ గ్రహణంబు చోరులకువలె నితరరాజులకును, మనదేశమును గ్రహించుట కరతలామలకముగాక వేరొండుకలదే! కనుకనేగద యింగ్లీషు వారు మనదేశమును వశపరచుకొనినపిమ్మట మెకాలే దొరను విచారింప నతడు హిందూదేశమునందు చిరకాలము రాజ్యముచేయదలచిన నిచ్చట నాంగ్లమును న్యాయస్థానమందు వ్యవహరింపవలెను, ఇంతియగాక కళాశాలల నేర్పరచిన కొలదికాలములోనే దేశమంతయు వ్యాపించునని చెప్పియున్నాడు. ఆ మహాశయుడు వచించిన రీతినే యిపుడు హిందూదేశమంతయు నాంగ్లము వ్యాపించినది. ప్రపంచమం దంతయు విశేషభాగములందు మనదొరతనమువారి పరిపాలనము విస్తరిల్లుటచే నాంగ్లమును విస్తరిల్లినది. అన్యదేశంబులకేగి విద్యగరపనుంకించు

విద్యార్థులకును యాత్రికులకును బాష్పయంత్రసాహాయ్యము చేగొప్ప వాణిజ్యము చేయు వణిజులకును ప్రపంచమం దంతట వ్యాపించుట చేతను రాజభాషయగుటచేతను సామాన్యభాషగ నెన్నబడుటచేతను హిందూవాసులకేగాక ప్రపంచవాసులకుగూడ నాంగ్ల మవశ్యముగ నభ్యసనీయంబైనది. ఆంగ్లమే యవశ్యముగ నభ్యసనీయంబైనచో నానావిధస్వర్ణ కటకంబులబోలు వృత్తాలంకృతియు రసోజ్జీవితంబగు నదియు, గణయతిప్రాసాదులచే లావణ్యము పెంపొందునదియు నుచ్చ భావగర్భితంబగుటచే పతివ్రతయగునట్టి మనయాంధ్రకావ్యకాంత యేమికావలసివచ్చును. రాజు తన పట్టమహిషివదలి సామాన్యలలా మము పాళించునే యని ప్రశ్నింపవచ్చును. దేశభాషయగు నాంధ్ర మును వదలి మరియొకభాష నభ్యసించుట మిక్కిలి యపయశస్కరము.

తండ్రి పితృకర్మానుష్ఠానయోగ్యుండగు జ్యేష్ఠపుత్రుని వదలి కనిష్ఠుని ప్రేమించునే. అట్లయినచో పిండప్రదాతలెవరు? మనుజుడు తనదేశమం దాదేశభాషవదలి యాంగ్లము వ్యవహరించు టెట్లు పొసగును? వ్యవహరించినను శ్రేయోదాయకంబగునా? సామాన్య రహితులకుసయితము తనభాష మెరిగింపజాలునా! లేదు. కడుహాస్యా స్పదుడగును. కనుక ప్రతిమనుజుడును తనదేశభాషను గారవించి సమగ్రపాండిత్యప్రకర్ష కలిగి దేశభాషామాతవద్ద ననుజ్ఞనొంది యాంగ్ల మును గారవింపవలెను. ఆంగ్లమును ద్వితీయస్థానం బధిష్ఠింపజేసి దేశ భాషామతల్లి నగ్రభాగంబు నధిరోహింపజేసి మనుజుడు సారథియై తనరథవరంబుచే నీసంసారగహనంబు నతిలంఘించి ముక్తిమార్గ మనుస రించుగాత.

—• బ్రాహ్మణీరత్నవతులు తపస్సుచేయుట. •—

సీ॥ చాంద్రాయణంబులు చరియించుటయుఁ దప్తకృచ్ఛ్రంబులాచరించి కృశులగుటయుఁ
సాంతపనంబులు సరిగఁ సల్పుటయును పక్షకాలంబున సాపడుటయు
నొకపూఁటనే తిని యాఁకటనుండుటయును రెన్నాళ్ళకొక్కసారి తినుచుటయు
మూన్నాళ్ళకొకమాఱు భుజియించుటయు నయాచితమైనదాని బోఁచేయుటయును
దపమునకు ద్వారములుగాఁగ ధాతచేతఁ జేయఁబడినవి-వీనిలోఁ జేతనైన
వాని రాగంబు ద్వేషంబు వదలిచలుపఁ గాంక్షితంబులు సిద్ధింపఁగలవు బిడ్డ! ౧౬౧
తే॥ శత్రులందును నత్యంతమిత్రులందు రాలయందును రతనపుఁ జాలమందు
నెపుడు సమమైనభావన యేరుపడునో యపుడ యయ్యెడు మోక్షంబు హస్తగతము
తే॥ ఎవఁడు లింగంబు గ్రహియించి యవల మరలఁ బాపరతుఁడగు వాని సర్వంబు భస్మ
మందు హుతమగునదివోలె వ్యర్థమగును-దపమువిధ మేమిచెప్పుదుఁ దనయ! నీకు”

వ॥ అనవుడు బ్రాహ్మణి వల్లెయని రత్నవతీసహితంబుగా స్వచ్ఛోదకపూరితం
బును బద్మినీషండమండితంబును నగు నొక్క జలాశయంబు సమీపించి ౧౬౪

సీ॥ చాంద్రాయణంబును జరియించె మునుమున్న-తరువాతఁ గృచ్ఛ్రసాంతపనములును
దదుపరి వత్సరత్రయము బద్ధశ్రద్ధ నాఱవకాలమం దారగించె-
మూఁడేండ్లు పదఁపడి మూన్నాళ్ళకొకపరి యుపవాసముల నెంతయును గృశించె-
నొకనాఁడుగాక యింకొకనాఁడు పిమ్మట నొగిని నిరాహారయగుచునుండెఁ
గడఁగి హేమంతమున వారినడుమనిలిచె-నుండెఁ బంచాగ్నిమధ్యమం దెండవేళ-
బట్టబయలున వసియించె వర్షములను బ్రాహ్మణి తపంబుఁజేసెడిపట్ల నిట్లు, ౧౬౫

వ॥ దేవదేవుఁడగు చంద్రశేఖరు ధ్యానించుచు రేయుంబవళ్ళు నాపె యట్లుంట
తిలకించి రాజకుమారి పరమసంతోషంబున ౧౬౬

సీ॥ నూటయేఁబదియేండ్లు నూటిగాఁ దపముండె ఫలభక్షణంబును సలుపుకొనుచుఁ-
బండుటాకులఁదించుఁ బదఁపడి యన్నియేం డ్లాత్మలో ధ్యానించె నంధకారి-
నటుతరువాతఁదా నాఱునూఱులయేడు లుదకపానముతోడ నుండె నిష్ఠ-
నావల వెయియేడు లత్యంతనియతిమైఁ బవమానభక్షణ పరతమనియె.
నెట్టులెట్టులఁ దపముండె నట్టులట్టు లాపెకుం దేజ మభివృద్ధియగుడు నపుడు
చంద్రశేఖరుఁ డంబికాసహితుఁడగుచు దరిసెనంబిచ్చి బ్రాహ్మణిఁ గుఱిచి ప్రేమ
క॥ “తనయా! యస్మద్వాక్యము విని చాలింపు మికఁ దపము- వేగ నభీష్టం
బును వచియింపు మొసంగెద- ననుమానమువలన దేతదర్థ మెడందన్” ౧౬౭

వ॥ అని ప్రసాదించుటయు బ్రాహ్మణి యిట్లనియె. ౧౬౯

తే॥ "ఏమి కావలెనింకను నీశ! నాకు- దర్శనంబునొసంగితి దయనువచ్చి-
స్వప్నమునఁగూడఁ దావకదర్శనంబు దొరకు టెంతయు దుర్లభ మరయ ధరణి"

వ॥ అని యిట్లుపలుకుటయు మరల భగవానుండు ౧౭౧

కం॥ "నా దస్మదీయదర్శన మేటికను వృథాగఁ దాపసీ! కావున నీ
వేదేని వరముగోరుము- కాదనక దియిచ్చిపోవఁగాఁగలవాఁడన్" ౧౭౨

వ॥ అని వక్కాణించుటయు బ్రాహ్మణి మఱియు నిట్లనియె- ౧౭౩

శా॥ "రత్నవతీసమాఖ్యఁ గడు రాణవహించిన యీనృపాత్మజా
రత్నము నాకుఁ బ్రాణసఖి- రాజశిరస్క! చతుర్థయుయ్యెఁదాఁ
బ్రత్నముగం బొనర్చెడిఁ దపంబును నేనుబొనర్చినట్లు- లీ
యత్నము పూర్వ మచ్చటనె యాచరితవ్యము నీకుఁ బూత్రిగన్- ౧౭౪

శా॥ చాలింపం దప మీవె తత్క్షణమ నేఁ జాలించెదన్- సంశయం
బేలే దిందుల- కీశచెల్మి విడలే కేఁ బెండ్లియున్ మాని యీ
లీలన్ మేలితపంబు సేయుటకు శూలీ! పూనుకొన్నాను- నా
పాలన్ నీవు కృపాళువైన నిడు మీ పద్మాక్షి యిష్టార్థముల్" ౧౭౫

వ॥ అనినవిని భగవంతుఁడగు శశిశేఖరుండు రాజపుత్రినుద్దేశించి మేఘగంభీర
భాషణంబుల నిట్లనియె. ౧౭౬

తే॥ పుత్రి! నామాటవిని తపఁబును ద్యజించి చిత్తముననుండుకోరిక చెప్పుకొనుమ-
యీయరానట్టిదైనను నిపుడుదాని నీయనున్నాఁడనీకు నేఁ దోయజాక్షి! ౧౭౭

వ॥ అనియిట్లునుడువుటయు రత్నవతి ౧౭౮

ఉ॥ "తామరతీవెమొత్తములఁ దద్దయు రాజిలు నేది యెద్ది శ్రీ
రామహితంబు బిట్టు తపముండెను బ్రాహ్మణి యత్తటంబునం
దామహనీయమైనహ్రద మాయమ పేరటఁ దీర్థరాజమై
యీమహి ఖ్యాతిఁజెందవలె నెంతయు హైమవతీమనోధవా! ౧౭౯

కం॥ ఎవఁ డీతీర్థంబునఁదా నవగాహనమాచరించు నవ్వాఁడు సదా
దివమున వసింపవలయును భవదీయంబగు వరప్రభావమువలనన్- ౧౮౦

కం॥ నేనుదపమున్నయది శూద్రానామముతోడఁగూడి తత్సమమహిమన్
దానొకతీర్థోత్తమమై యేనస్సు హరింపవలయు నీశ్వర! సరవిన్- ౧౮౧

కం॥ ఈమహితతీర్థములకడఁ గౌమార్యంబునఁ దపంబు గావింపవలెన్-
స్వామీ! యట నారాధ్యుఁడవై మనవలె నీవ తపములందటిచేతన్" ౧౮౨

వ॥ అని కోరుసమయమ్మునకుఁ బుడమిం బగుల్చుకొని సూర్యసన్నిభంబగు శివలింగంబు బయలువెడలె-నంత భక్తవత్సలుండగు మహేశ్వరుండు తత్కన్యకల తపంబునకు మెచ్చి ౧౭౩

ఆ॥ "శూద్రియనఁగనీది సుందరీ! బ్రాహ్మణియనఁగ నీదు చెలిది యనఘయయిన
తీర్థయుగళమగుచుఁ ద్రిజగంబులందును బేరుగాంచఁగలవు-పెక్కుతెల- ౧౭౪

తే॥ చైత్రశుక్లచతుర్దశీచంద్రవాసరమున నిటునాడి వాదులింగమున కధిక
భక్తి నభిషేకమొనరించి పంకజముల నర్చనముసేయు దీర్ఘాయువగు నరుండు" ౧౭౫

వ॥ అనిపలికి యంతర్ధానంబుఁజెందుటయు బ్రాహ్మణీరత్నవతులిరువురును దత్తీర్థసవిధంబునఁ దపస్సుఁజేయుచు జరామరణవర్జితలై కల్పశతంబుండి యిప్పటికిని నక్షత్రరూపలై తారాపథంబునఁ గనఁబడుచున్న వా-రది మొదలుకొని యాతీర్థములు రెండును బ్రసిద్ధికివచ్చె-దవ్వుదవ్వులనుండి ప్రజలువచ్చి వానిలో స్నానమొనర్చి యాలింగంబును బూజించి పంచమహాపాతకములుచేసినవారైనను దీర్థప్రభావంబున స్వర్గంబున కరుగఁజొచ్చి-రింతలోపల భూలోకంబున యజ్ఞదానదేవతాపూజనాదిరూపమైన ధర్మకర్మంబులు నష్టంబులయ్యెఁ-ద్రిదివమంతయు విమానస్థులును నప్సరోగణసేవితులును నగు దేవతలతో స్పర్ధఁజేసెడి మానవులచే వ్యాప్తమయ్యె-నట్టితఱిం బరేతరాట్టు బ్రహ్మలోకంబునకుఁబోయి రెండుపత్రంబులు బ్రహ్మముందఱం బెట్టిచింతను వెలిపుచ్చుచు ౧౭౬

ఆ॥ "ఒకటఁ బాపములు మఱొక్కటఁ బుణ్యము ల్గలవు వీనిలోనఁ గమలజన్మ!
యొకటి చిత్రుచే మఱొకటి విచిత్రుచే వ్రాయఁబడినవివి మదీయసభను- ౧౭౭

తే॥ శూద్రి బ్రాహ్మణి యనుపేళ్ళ శుద్ధతీర్థములు గలవు హాటకేశ్వరునను రెండు-
పుణ్యతమమైన శివలింగమును జెలంగు నమ్మహాక్షేత్రమధ్యమం దవ్విధమున- ౧౭౮

కం॥ అమూఁడింటిమహాత్తను హేమ స్తేయాది దారుణోనోరతులుక్
వైమానికులంబలె స్వర్గాములు కాఁజొచ్చి-రేటిధర్మము లింకన్- ౧౭౯

తే॥ రౌరవముదొట్టి యత్యంతరౌద్రములగు నారకములెల్ల నుండెడివారు లేక
పాడుపడియున్న యవి ప్రజాపతి! యింకేమిచెప్పుకొందును నీతోడ సిగ్గువిడిచి-

సీ॥ ఆత్మలోపల నేని యధ్వరంబులమాట తలపెట్టఁ డొకఁడు- నీ నిలయమే మె-
పిడికెడుగింజలేక బీదసాదలకుఁదాఁ బెట్టఁ డొక్కఁడు- నేమిపట్టుదలయొ-
దంభంబునకు నేని దైవతంబులఁగూర్చి నతిసేయఁ డొక్కండు నాస్తికతను-
శ్రాద్ధంబు నాఁడేని స్వపితృతర్పణమును విడువఁ డొకండు దుండుడుకుమిగులఁ-
గాన వదలుకొంటి నే నీదునుద్యోగ- మిమ్ము శక్తుఁడైన యింకనొకని-
కేమిటికిలిఖించు టీకమ్మలం దింక జమ్మికిందివారితచాయఁ దోఁప- ౧౮౧

వ॥ అనినవిని పంకజాసనుండు పాకశాసనుంబిలిచి ౧౯౩

తే॥ "శక్ర! నామాటవినినీవు శ్వభ్రస్థలమునకేగి యిప్పుడ శ్రీహాటకేశ్వరమున
కూడి బ్రాహ్మణి యనువేళ్ళ శుద్ధతీర్థములను శివలింగమును బాంసువులను నింపు"

వ॥ అనినవిని శతమఖుండు సత్వరంబుగా శ్వభ్రస్థలంబునకుఁజని యా తీర్థములను దల్లింగమును బరాగములచేఁ గప్పివైచె- నీకలికాలంబునసహితము సకలపాతకనివృత్తికై యాతీర్థంబులలోని మృత్తికతీసి నీరమాడి తిలకంబు ధరించునది- చతుర్దశీ సోమవాసరంబునఁ దత్తీర్థద్వయసవిధంబున శ్రద్ధాయుతంబుగా శ్రాద్ధంబుపెట్టినవానికి గయాశ్రాద్ధంబుతోఁ బనిలేదని స్వాయంభువమనువు వక్కాణించె- మీరలడిగిన బ్రాహ్మణీ శూద్రీతీర్థవృత్తాంతముం జెప్పినవాఁడ- నియ్యది చదివినను విన్నను నిస్సంశయంబుగా నానాఁటి పాతకంబు నశియించు- నిట్లు తల్లింగపూజనంబున సిద్ధుండును జిరాయువును గాని నరుఁ డీలోకంబునఁ గానంబడఁ"డని వచించుటయు ఋషులిట్లనిరి. ౧౯౪

—* నాగరాష్టకుల శ్రైష్ఠ్యవర్ణనము. *—

తే॥ "మూఁడునరకోట్లుతీర్థము లున్న నసకృత్సన్నముగను శ్రవణించియుంటిమి మునులవలన
నఖిలతీర్థంబులందాడ నబ్బుఫల మెటుల లభించును నల్పాయువులకుఁ గలిని" ౧౯౫

వ॥ అనియిట్లుప్రశ్నించుటయు సూతుండిట్లనియె- ౧౯౬

సీ॥ "ముఖ్యంబు లందులో మూఁడు తీర్థంబులు- రాణనొప్పును మూఁ డరణ్యములును-
ముక్తిప్రదాయకమ్ములు మూఁడు క్షేత్రనాల్-మునుమున్న వాచ్యము లున్మూఁడుపురులు-
మూర్ధంబులనఁబడు మూఁడుపర్వతములు-కడుశ్రేష్ఠములు మూఁడుగ్రామములును-
మరి పెంపునొదఁగూర్చు మూఁడుతరంగిణుల్- మునివాసయోగ్యము లున్మూఁడువనము-
లఖిలపాపహరములై మర్త్యలోకమందున్నయట్టి వానియన్నిటను నె
వండు స్నాతుఁడగునో వాఁడు తా సర్వతీర్థావగాహాఫలము నందఁగలఁడు- ౧౯౭

వ॥ ఈయిరువదినాలుగింటను నొక్కొక్క-మూఁడింట నీరమాడిన సర్వతీర్థస్నాన
ఫలంబు గలుగు"నని యిట్లువక్కాణించుటయు శౌనకాదులు ౧౯౮

సీ॥ "ముఖ్యంబులైన యామూఁడుతీర్థము లెవ్వి? రాణనొప్పెడి మూఁడరణ్యము లెవి?
ముక్తిదాయకములౌ మూఁడు క్షేత్రము లెవ్వి? పూర్వవాచ్యములైన పురము లెవ్వి?
మూర్ధంబులనఁబడు మూఁడు శైలము లెవ్వి? కడు శ్రేష్ఠమౌ మూఁడుగ్రామము లెవి?
మరి పెంపునొదఁగూర్చు మూఁడు హ్రదిను లెవ్వి? మునివాసయోగ్యమౌ వనము లెవ్వి?
యఖిలపాపహర మైలై మర్త్యలోకమం దున్నయట్టి వాని నొక్కటొకటి
యానతీయు"మనుడు నారోమహర్షణి యెలమిమీఱ వారి కిట్టులనియె- ౧౯౯

వ॥ కురుక్షేత్రంబును హాటకేశ్వరంబును బ్రాభాసికంబును బుణ్యక్షేత్రంబులు సర్వపాతకనాశకంబులు. ఈ క్షేత్రత్రయంబున స్నానమొనరింప నభీష్టసిద్ధియగుటయు కాక చతుర్వింశతిస్నానఫలంబు ప్రాప్తించెడిఁ. బుష్కరంబును నైమిశంబును ధర్మారణ్యంబును నరణ్యంబు. లీ మూఁడింటను స్నాతుఁడగువాఁడు చతుర్వింశతిస్నానఫలభాక్కయ్యెడు. వారాణసియు ద్వారకయు నవంతియుఁ బురంబు. లీమూఁడింట వాడు వాఁడును జతుర్వింశతిస్నానఫలభాక్క. బృందయు ఖాండవంబును ద్వైతంబును వనంబు. లీమూఁడింటఁ గ్రుంకువాఁడును జతుర్వింశతిస్నాతయ. కల్పగ్రామంబును శాలిగ్రామంబును నందిగ్రామంబును గ్రామంబులు. వీనిమూఁడింట స్నానమొనర్చినఁ జతుర్వింశతిస్నానఫలంబుగలుగు. వహ్నితీర్థంబును శుక్లతీర్థంబును బిత్పృతీర్థంబును తీర్థంబులు. వీనిమూఁడింటఁ దీర్థమాడఁ జతుర్వింశతిస్నానుండగు. శ్రీశైలంబును నర్బుదంబును రైవతంబును బర్వతంబులు. వీనిమూఁడింట నీరమాడినఁ జతుర్వింశతిస్నానఫలంబు చేకురెడిని. గంగయు నర్మదయు సరస్వతియు నదులు. వీనిమూఁడింట నాడు వాఁడును జతుర్వింశతిస్నానఫలభాక్కయ్యెడు. నీయిరువదినాలిగింట స్నానమొనర్చిన సార్ధకోటితీర్థస్నానఫలంబు సమకూరు. నొక్కదాన మునుంగ మూఁడింటమునిగినంత యగు. మీచే నడుగఁబడిన దంతయు వ్రాక్రుచ్చితి. మఱియు నేమివినవలతు"రనుటయు శౌనకాదులిట్లనిరి. ౨౦౦

తే॥ "హాటకేశ్వరమున నసంఖ్యాకములయి యలరుతీర్థంబు లాఖ్యదేవాలయములు
వినిచినాఁడవు నీవు సవిస్తరముగ మాకు సూతాత్మజా! మంచిమాటె కాని ౨౦౧

తే॥ వర్షశతమునకేనిఁ విధివంతముగను వానియన్నింట మునుఁగంగ వశముగాదు.
అవ్విధంబున దేవతాయతనములను నరుల కవలోకనము సేయఁ దరముకాదు. ౨౦౨

తే॥ అల్పమాయువు కృతయుగమందుఁగూడ మనుజులకుఁ, ద్రేత ద్వాపరమునను నటులె.
కలియుగంబునఁ జెప్పంగవలసిలేదు వారియాయువ్యమంగూర్చి వసుధలోన. ౨౦౩

తే॥ ఇట్టి లల్పాయువులుగాఁగ నెఱిఁగి నరుల నధములకుఁగూడ సర్వతీర్థావగాహ
బహుళదైవతదర్శనఫలముగలుగ నొకయుపాయంబువచియింపు ముత్తమంబు" ౨౦౪

వ॥ అనవుడు సూతుండు ౨౦౫

కం॥ "ఈవిషయంబును బూర్వం బా విశ్వామిత్రవరాని యాశ్రమమునకుఁ
దావచ్చి యడిగె నానర్తావన్యధినాథుఁ డిటుల నార్యులు! వినుఁడీ. ౨౦౬

ఆ॥ "అనఘ! లెక్కలేని ఘనతీర్థములు వాన సలుపఁదగినయట్టి స్నానవిధులు
నేదినమున మఱియు నేవారమున నెట నాడవలసినదియు నడియుఁగాక ౨౦౭

ఆ॥ దానములును దేవతాదర్శనంబులు మునిముఖంబునుండి వినినవాఁడ-
వర్షశతమునకును వానియన్నింటి ఫలంబుఁ బడయ నెట్టిలావరికిని ౨౦౮

ఆ॥ అలవికాదు కాన సులభమైనయుపాయమునను నొక్కదాన మునుఁగుమాత్రి
సకలతీర్థఫలము సమకూరువిధమును నానతీయుమయ్య యార్యవర్య! ౨౦౯

క॥ ఒక దేవతదరిసించిన సకలామరదర్శనమున సమకూరుఫలం
బకలంక! కలుగువిధమును బ్రకటింపఁగదయ్య నిన్నుఁ బ్రస్తుతిసేతుక్" ౨౧౦

వ॥ అనినవిని విశ్వామిత్రుండు పెద్దయుంబ్రొద్దు విచారించి ౨౧౧

చం॥ "వినుము సరహాస్య మోయధిప! వేనమునిరిగిన సర్వతీర్థముల్
చని మునుఁగక్ లభించు ఫలసంచయ మబ్బునొ యట్టితీర్థముల్
తనరెడి నందు నాలు- గటులక్ సకలాఘహరంబులైన చ
క్కని శివలింగము ల్కరము గ్రాలెడి నిర్వదియేడు తత్స్థలిక్- ౨౧౨

క॥ ఆలింగంబులనన్నిటి నోలిని దరిసించిన సకలోత్తమమదివిమ
ల్లాలముదరిసించిననగు మేలైన ఫలంబుగలుగు మేదిన్యధిపా! ౨౧౩

క॥ ఏదేవతదర్శించిన నేదేవతఁ గొల్చినను మహీపాలమణీ!
యాదిన్యలింగపూజకుఁ గాదెన- యింకేమిచెప్పఁగావలె నీకుక్" ౨౧౪

వ॥ అని పలుకుటయు రాజిట్లనియె- ౨౧౫

తే॥ "వేన స్నానంబుఁజేసినచో నరుండు బహుళతీర్థావగాహనఫలమువడయు
నట్టిపావనతమములౌ ననఘతీర్థములను దయతోడ వాక్రువ్వవలయు నార్య!"

వ॥ అనియిట్లుప్రశ్నించుటయు విశ్వామిత్రుండు ౨౧౭

తే॥ "స్మార్తజనక్రియమాణమౌ శ్రాద్ధములఁ గరంబు నిర్వీణ్ణులై బహుళంబునందు
వచ్చెడి చతుర్దశిని నమావాస్యయందు మతియుఁ బిత్రుపక్షమున గయ యరుగుచెంచి,

క॥ తనలో నివసించుటచేతను నొకకూపిక సతంబు తత్క్షేత్రమునక్
ఘనతీర్థంబయి వెలసెను- ననఘా! నాల్గింటిలోన నది యొక్కటిమా- ౨౧౯

క॥ ఎవఁ డతిభక్తిశ్రద్ధలఁ దవిలి యిదంక్షేత్రమందుఁ దానాడునొ త
ద్దివసంబుననే యవ్వాఁ డవుఁ బిత్రుసంతారకుఁడిలాధిప! వినుమా- ౨౨౦

ఆ॥ అట్లు శంఖతీర్థ మగు రెండవది-తపఃప్రథమదివసమందు భక్తి దాన
స్నానమాచరించి శంఖేశ్వరుం గొల్వ సకలతీర్థఫలము సరవిఁ గలుగు- ౨౨౧

ఆ॥ అట్లు నాదు పేర నలరెడితీర్థంబు మూఁడవది మహీశ! చూడు-భాద్ర
పదసితాష్టమిని సభక్తి నటం గ్రుంకి యేనునిలిపినట్టి యీశుఁ గొలువ ౨౨౨

ఆ॥ సర్వతీర్థఫలము సమకూరు- శక్రతీర్థాభిధానమునను ఖ్యాతమగుచు
బాలమండనంబు పరఁగుఁ జతుర్థమై హాటకేశ్వరమున నవనినాథ! ౨౨౩
ఆ॥ దాన నాశ్వయుజములోని సితాష్టమీదినము మొదలు పంచదివసములను
స్నానమాచరించి శక్రేశ్వరుఁ గొల్వ సర్వతీర్థఫలము సంభవించు" ౨౨౪
వ॥ అనినుడువుటయు మఱియు రాజిట్లనియె- ౨౨౫
క॥ నాపయి నత్యంతము శ్రద్ధోపేతుఁడ వైతివేని యర్వీశ! గయా
కూపస్నానవిధానం బోపికతోఁ జెప్పుమయ్య యుండినరీతిన్" ౨౨౬
వ॥ అనియిట్లడుగుటయు వెండియు విశ్వామిత్రుండు ౨౨౭
క॥ "రవి కన్యారాశిగతుం డవునెడ నమవసను భర్తృయజ్ఞోక్తవిధిన్
దవిలియట హాటకేశ్వరభవులుం బరిశుద్ధులు నగు బాపలతోడన్ ౨౨౮
క॥ శ్రద్ధాపూతమనస్కత శ్రాద్ధంబుం బెట్టునతఁడు స్వపితరులను సం
శుద్ధులఁ జేయం గలుగును బుద్ధిమదగ్రేసరా! విభూ! నిక్కముగన్- ౨౨౯
ఆ॥ భర్తృయజ్ఞవిధిని బాటింపకుండఁ దత్స్థానజాతులైన ధరణిసురుల
వదలి పెట్టి కాని వారిలోనైనను ఖలులఁ గాని శ్రాద్ధకర్మమునను ౨౩౦
ఆ॥ పిలువఁగూడ- దట్లుపిలిచి పెట్టంబడు శ్రాద్ధ మన్నిటను సమృద్ధమయ్యుఁ
జవిటినేలవిత్తు సస్యంబునుంబోలె వ్యర్థమగును భూప! వాస్తవముగ- ౨౩౧
ఆ॥ అంధునెదుటజరుపు నభినయంబులువోలె బధిరునెదుటఁ జేయఁబడెడి గాన
రవముభంగి స్థానభవులైనవిప్రుల వదలి చేయుపనులు వ్యర్థమధిప! ౨౩౨
తే॥ అజ్ఞులైనను స్థానికు లర్హులగుదు- రాగమజ్ఞులు నేనిని యుఁ త్యాజ్యులన్య-
లవనినాయక! పితృదేవతార్చనములఁ దమి విశేషించి సోమపానమున- వింటె-
క॥ స్థానికుఁడు దొరకకుండినవో ననలమొ దర్భలో త్రిశుద్ధిగ నొక సు
స్థానమునఁ జేర్చి శ్రద్ధను వాని పురస్థలమునందు వసియించి యొగిన్ ౨౩౪
ఆ॥ శ్రాద్ధమాచరించి చాలకాలమునకేన్ స్థానికుఁడు లభింప వానిఁ బిలిచి
తగ భుజింపఁజేసి దక్షిణయీయనా- స్థానికేతరునకుఁ దగదు తగదు- ౨౩౫
తే॥ స్థానికులెవ్వరున్న సుజాలు నొక్క బాహ్యుఁ డల శ్రాద్ధమును దోమ భాక్కుఁ జేయు
పంచగవ్యంబుచే నింపఁబడినపాత్రి నొక్క కలుబొట్టుపడి కాదె యొగిని జెఱచు-
సీ॥ ఓ కన్ని వంకరలున్నవో యెఱుఁగని యత్యంతమూర్ఖుండె యగును గాక
ముకుచెవుల్మొదలైన ముఖ్యావయవముల హైన్యంబు గలయట్టిఁ డగును గాక
కాళ్లో వ్రేళ్లో యధికంబయియుండుచు నతివికారశరీరుఁ డగును గాక-
వేష భాషలలోన విద్వద్ద్విజంబుచే నవయంబు దూషితుం డగును గాక-

స్థానికు సె పిల్వనగుఁజుమీ శ్రాద్ధకృతిని నుత్తముండు లభింపకయున్న యపుడు-
కన్యకాదానమున శ్రాద్ధకర్మమునఁ గులీను నార్జింపవలెఁ గోరెనేని శుభము-
సీ॥ గ్రామంబులలో రావిమాడ్కి- నాయుధముల వజ్రమట్లేళ్ళ దేవనదివోలె
సురలలో హరివలె సరసుల శరధిలా గడవిజంతువుల సింహంబుపోల్కి-
గ్రహముల నాదిత్యువహిఁ జుక్కలం జంద్రులలి నద్రులను సురాలయముభాతి
నాజుల నుచ్చైశ్శ్రవంబువిధంబున ద్విపదంబులందున ద్విజునికరణిఁ
గరుల నైరావతముమాద్రిఁ గామినీజనంబులోన నరుంధతిభంగిఁ బక్షి
సంఘమునఁ దార్క్ష్యుచాడ్పున స్థానజాతవిప్రులం దష్టకులజుండు పెద్దయగును-
కం॥ ఈవిధమెఱింగి శ్రాద్ధముగావించెడిసమయమునను గన్యకనొసఁగఁ
బోవువడి నధ్వరమునను గావలెనని యష్టకులజు గడియింపవలెన్- ౨౩౯
ఆ॥ అష్టకులుండువచ్చి యరుగుపైనెక్కుచోఁ బ్రీతి నాడఁదొడఁగుఁ బితృగణంబు-
గర్జనంబొనర్చుఁ గడుఁ బ్రీతిమైఁ బితామహగణంబు-వింటె మనుజనాథ: ౨౪౦
తే॥ జందె మపసవ్యముగదొడ్గి సరిగమాకు లలిని దిలదర్భసహితమా సలిలములను
విడుచు దౌహిత్రుండని కడువేడ్కతోడఁ జెప్పుకొందురు పితరు లోక్షితిప! మఱియు॥
వ॥ అనివక్కాణించుటయు రాజిట్లనియె- ౨౪౨
తే॥ "అష్టకులజులు తక్కునాగరాళియందు శ్రేష్ఠులని స్పష్టముగనీవు చెప్పినాడ-
వల్పమైయుండ దిట హేతు వరసిచూడ-వినుచు మయ్యది నాకు సవిస్తరముగ"
వ॥ అనియిట్లుప్రశ్నించుటయు విశ్వామిత్రుండు ౨౪౪
ఉ॥ "సత్యము నీవుపల్కినది క్ష్మాతలనాయక! సాంగవేదముల్
నిత్యము వల్లెవేయఁగల నేర్పరు లింకను మన్నవారు సం
స్తుత్యులె నాగరుల్-సనవధూర్వహణంబునయందు శ్రాద్ధపుం
గృత్యమునందుఁ గన్యకలనిచ్చెడిపట్లను వారు యోగ్యులే- ౨౪౫
ఆ॥ ఇంక నేమియనిన నింద్రుండు వారియం దష్టకులులఁజేసె నగ్రణులుగ-
నన్యనాగరులును ననుమతించిరిదాని-కష్టకులులు శ్రేష్ఠులైరి యిట్లు- ౨౪౬
తే॥ అట్లుగావున శ్రాద్ధమం దష్టకులులు భోజ్యులవ్వారు దొరకక పోయినప్పు
డన్యనాగరులను బిల్చునది-మఱొక్క-స్థానమునఁబుట్టినట్టిరు తగరు దాన- ౨౪౭
కం॥ శ్రుతులనునాల్గిటిఁజదివిన మతిమద్వరులైనఁగాని మాన్యులుగారిం
దితరద్విజు-లీనియమము కృతమయ్యెను భర్తృయజ్ఞకృతిచేతను మున్- ౨౪౮
తే॥ నాగరద్విజుఁబిల్వ కన్యద్విజన్ముఁ బిలిచి శ్రాద్ధంబొ యజ్ఞంబొ సలుపునెడల
వ్యర్థమగుఁగాని యయ్యది సార్థకంబుగాదు భూపాల! యింక నేమికలదు చెప్ప-

౮ వేలూరి రామన్న గుప్తగారు, సదాశివునిపేట

౯ రాయచూరి బండేరావుగారు, అయినాపురం.

౧౦ రాచూరి సుబ్బయ్యగారు – శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి

౧౧ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు – ముసలాపురం

౧౨ దండు గుండేరావుగారు, కరణము – ముసలాపురం

౧౩ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు – ముసలాపురం

౧౪ కామమాను హనుమయ్యగారు, నర్సారావుపేట

౧౫ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

౧౬ భాస్కరరాయుని వెంకటరామయ్యగారు, వంగపల్లి

౧౭ నరసింహస్వామివారు, యాదగిరి

౧౮ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి

౧౯ జూలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు

౨౦ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి

౨౧ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ప్లీడరుగుమాస్తా, గురిజ

౨౨ వెలిదెండ్ల సత్యనారాయణగారు – కరణం, చింతిరాల.

౨౩ కవులూరి నరసింహారావుగారు, రివిన్యూయినస్పెక్టరు – పిడుగురాళ్ళ

౨౪ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబిన్స్పెక్టరు, ప్రత్తిపాడు

౨౫ రాచకొండ వెంకటరామయ్యగారు, యెనమదల

౨౬ కప్పగంతు సుబ్బారావుగారు – పోలీసుసబిన్స్పెక్టరు – బొల్లాపల్లి

౨౭ మండవ చినవెంకయ్యగారు, దండమూడి.

౨౮ శ్యామాపంతుల గోపాలరావుగారు – హైదరాబాద్.

౨౯ కన్నయ్యగారిసంగయ్యగారు–ముసలాపురం

౩౦ చక్కులం పాపయ్యగారు–ముసలాపురం

౩౧ తాళ్ళవెలిమె లింగన్న మొకద్దంగారు–గడిపెద్దాపురం

౩౨ కిషన్ రావు దేశపాండ్యాగారు తాళ్ళపల్లి

౩౩ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం.

౩౪ చివుకుల శ్రీరామశర్మగారు– నాగులుప్పలపాడు

౩౫ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౬ కకిరాల రామచంద్రయ్యగారు, మముదాపురము

౩౭ లక్ష్మీనారాయణ గాడు సెట్టిగారు, అందోలు

౩౮ ఇటికాల రాజేశ్వరరావుగారు – వకీలు కంభంమెట్టు

౩౯ వెలకుకన్ని శోభనాద్రిరావుగారు – శోభనాద్రిగూడెం.

౪౦ నారపరాజు వెంకటలక్ష్మీనరసింహారావు దేశముఖుగారు – తమ్మవరం.

౪౧ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యుల అయ్యవార్లంగారు . శాతాపురం.

౪౨ కొండంభట్లగారి వెంకన్న గారు. గుమ్మడిదల

అభినవసరస్వతి

సంపాదకుఁడు — నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును బ్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీకోద్ధారిణి [పూరె వీరభద్రకవి] ...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము ...	0	4	0
3	కంసవధ నాటకము ...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)	0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర ...	0	2	0
6	నీతిగీతులు (సుమతిశతకమునకు సంస్కృతము) ...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము	0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము ...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి) ...	0	4	0
10	సంగదోషము ...	0	3	0
11	అస్పృశ్యతానివారణ ఖండనము(మల్లాది రామకృష్ణచయనులుగారు)	0	8	0
12	వత్సలనీతిశతకము ...	0	1	0
13	శివానందలహరి (తంగెడ. రామకృష్ణకవి) ...	0	4	0
14	నరసారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము)	0	3	0
15	పశ్యాంపుశ్యాం ...	0	2	0
16	పశ్యశబ్దవిచారము ...	0	2	0
17	పురశ్చరణము ...	0	2	0
18	శంతనురాజచరిత్ర ...	0	14	0
19	వర్ణవ్యవస్థ ...	0	4	0
20	స్వర్ణకారవ్యవహారము ...	1	8	0
21	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము ...	0	10	0
22	అభినవశాకుంతల నాటకము ...	0	8	0
23	సూతసంహిత-ఆంధ్రము ...	2	0	0
24	స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)	1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)	1	8	0
26	భారతీయప్రబోధము (పిసుపాటి చిదంబరశాస్త్రి)	0	4	0
27	ధర్మనిర్ణయము.	0	4	0
28	భారతకథాతత్త్వనిర్ణయము(మల్లాదిరామకృష్ణవిద్వచ్ఛయనులుగారు)	0	4	0

అభినవసరస్వతీ కార్యస్థానము జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరు జిల్లా.